ప్రజాశక్తి
శుక్రవారం 10 అక్టోబర్ 2025
8 పేజీలు
విశాఖపట్నం అనకాపల్లి





ప్రజారోగ్యంపై తీవ్ర నిర్లక్ష్యం

- కూటమి సర్కారుపై నిప్పులు చెరిగిన వైసిపి అధినేత జగన్
- మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాలు సేకరిస్తామని ప్రకటన
- మాకవరపాలెం వైద్య కళాశాల నిర్మాణాల పరిశీలన
- కెజిహెచ్‌లో 'కురుపాం' గురుకుల విద్యార్థినులకు పరామర్శ
- టెన్షన్ వాతావరణం నడుమ ఉమ్మడి విశాఖలో సాగిన పర్యటన



కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థినిని పరామర్శిస్తున్న జగన్

ప్రజాశక్తి - కోటవురట్ల, విశాఖ కలెక్టరేట్ విలేకరులు

ప్రజారోగ్యం పట్ల కూటమి సర్కారు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని వైసిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్ రెడ్డి విమర్శించారు. చంద్రబాబు సర్కారు మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేస్తే పేదవాడికి వైద్యం ఎలా అందుతుందని ప్రశ్నించారు. గురువారం ఆయన మాకవరపాలెం మండలంలోని భీమ బోయినపాలెం గ్రామం వద్ద మెడికల్ కాలేజీ నిర్మాణాలను సందర్శించారు. తొలుత ఆయన గన్నవరం నుంచి విశాఖ ఎయిర్‌పోర్టుకు విమానంలో చేరుకున్నారు. తదుపరి ఎయిర్‌పోర్టు నుంచి షరతులతో కూడిన రోడ్డు మార్గంలో ఎన్ఎడి జంక్షన్, పెందుర్తి, అనకాపల్లి, తాళ్లపాలెం మీదుగా మాకవరపాలెంనకు వచ్చారు. అక్కడ మెడికల్ కాలేజీల నిర్మాణాల వద్ద మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో 17 మెడికల్ కాలేజీలను తమ ప్రభుత్వంలో ప్రారంభించగా ఏడు కాలేజీలు పూర్తయి, ఐదింటిలో తరగతులు కూడా ప్రారంభమయ్యాయని అన్నారు. అమరావతి కోసం రూ.లక్షల కోట్లు ఖర్చు చేస్తామంటున్న చంద్రబాబు మెడికల్ కాలేజీల నిర్మాణాలకు రూ.5 వేల కోట్లు ఖర్చు చేయలేరా ? అని మిగతా 2లో..



మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

భూసేకరణ పనులు పూర్తి చేయండి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : జిల్లా పరిధిలో చేపట్టనున్న విశాఖ మెట్రో రైలు ప్రాజెక్టు, రైల్వేలైన్ల విస్తరణ, ఇతర పనులకు సంబంధించి భూసేకరణ ప్రక్రియ, ఇతర పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ భవనంలో జరిగిన సమీక్షా సమావేశంలో మెట్రో రైల్, సాధారణ రైల్వే లైన్ విస్తరణ, ఇతర అవసరాలకు కోసం చేపట్టాల్సిన భూసేకరణ సంబంధిత పనులు, ఇతర అంశాలపై ప్రస్తుత పరిస్థితిని అధికారులు అడిగి తెలుసుకుని సూచనలు చేశారు. అభివృద్ధి పనులకు సంబంధించిన అన్ని రకాల పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలు చేసి చర్యలు చేపట్టాలన్నారు. కోర్టు పరిధిలో ఉన్న అంశాల పరిష్కారంలో అధికారులు తీరుపై అసహనం వ్యక్తం చేస్తూ ప్రత్యేకశ్రద్ధ తీసుకొని పరిష్కారానికి కృషి చేయాలని సంబంధిత అధికారులు ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి భవానీ శంకర్, విశాఖపట్టణం, భీమిలి ఆర్‌డిఒలు పి.శ్రీలేఖ, సంగీత్ మాథుర్, ప్రత్యేక ఉప కలెక్టర్ సుధాసాగర్, మెట్రో ప్రాజెక్టు అధికారులు, జివిఎంసి, విఎంఆర్డిఎ, ఎపిఇపిడిసిఎల్, పలువురు తహశీల్దార్లు పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాలు అందక పోవడంపై నిలదీత

వార్త 3లో..

అపారిశుధ్యమే కారణమా ?

వార్త 3లో..

సిజెఐ గవాయ్‌పై దాడి హేయం

వార్త 8లో..



మాట్లాడుతున్న లోకనాథం, చిత్రంలో జగ్గునాయుడు తదితరులు

అదాని సిమెంట్ ఫ్యాక్టరీపై ప్రజాభిప్రాయ సేకరణ రద్దు చేయండి

సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం

వార్త మెయిన్‌లో..

అదరగొట్టిన భారత బ్యాటర్లు

దమ్మురేపిన రిచాఘోష్

విశాఖలో క్రికెట్ సందడి

ఉత్కంఠగా ఇండియా, సౌతాఫ్రికా మ్యాచ్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఐసిసి ఉమెన్స్ వరల్డ్ కప్ 2025లో భాగంగా గురువారం విశాఖపట్నం వేదికగా జరిగిన భారత్ - సౌతాఫ్రికా మ్యాచ్ క్రీడాభిమానులను అలరించింది. విశాఖ వాసుల్లో జోష్ నింపింది. వర్షం కారణంగా ఈ మ్యాచ్ గంట ఆలస్యంగా ప్రారంభమైంది. భారత్ టాస్ ఓడిపోయి బ్యాటింగ్‌కు దిగింది. ప్రారంభంలో భారత జట్టు ఓపెనర్ ప్రతీక రావాల్ ఫోర్లతో అలరించినా వెంటవెంటనే వికెట్లు పడిపోయాయి. 102 పరుగులకు ఆరు వికెట్లు కోల్పోయిన క్లిష్ట సమయంలో బ్యాటింగ్‌కు దిగిన రిచా ఘోష్ 11 ఫోర్లు, 4 సిక్స్‌లతో అద్భుతంగా రాణించి 94 పరుగులు చేసి తృటిలో సెంచరీ మిస్సయింది. స్నేహ రాణా 6 ఫోర్లతో అలరించింది. వీరు ఫోర్లు, సిక్స్‌లు కొడుతుంటే ప్రేక్షకులంతా కేరింతలు కొట్టారు. భారత ప్రధాన క్రీడాకారిణి స్మృతి మంధాన ఆరంభంలో ఒక సిక్స్, ఒక ఫోర్ కొట్టినప్పటికీ ఎక్కువ సేపు క్రీజ్‌లో నిలువలేదు. తుదకు 49.5 ఓవర్లలో 251 పరుగులకు భారత్ ఆలౌట్ అయింది. తదుపరి బ్యాటింగ్‌కు దిగిన సౌతాఫ్రికా జట్టు రాత్రి 11 గంటల సమయానికి 46.3 ఓవర్లలో ఏడు వికెట్లు కోల్పోయి 228 పరుగులు చేసింది. ఆ జట్టులోని లారా వాల్వార్డట్ 70 పరుగులతో రాణించింది.



షాట్ కొడుతున్న ప్రతీక రావల్

సందడిగా మారిన స్టేడియం

సుమారు 29 సంవత్సరాలు తర్వాత విశాఖపట్నం వేదికగా ఐసిపి ప్రపంచ కప్ మ్యాచ్ జరిగిన నేపథ్యంలో ప్రేక్షకులు భారీగా స్టేడియానికి తరలివచ్చారు. తమ అభిమాన క్రీడాకారులను దగ్గర నుంచి చూసి కేరింతలు కొట్టారు.

మొదటి పేజీ తరువాయి..

ప్రజారోగ్యంపై తీవ్ర నిర్లక్ష్యం

ప్రశ్నించారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 10 నుంచి నవంబర్ 22 వరకూ కోటి సంతకాల సేకరణ ఉద్యమం చేపడతామన్నారు. నర్సీపట్నానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు, స్పీకర్ సిహెచ్.అయ్యన్నపాత్రునిపై జగన్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. వైసిపి హయాంలో తలపెట్టిన మెడికల్ కాలేజీలపై ఆయన అబద్ధాలు మానుకోవాలన్నారు.

ఇతర అంశాలపై జగన్ ఏమన్నారంటే..

పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం గురుకుల పాఠశాలలో విద్యార్థినులు పచ్చకామెర్లతో బాధపడుంటే వారికి కనీసం శుద్ధమైన మంచినీళ్లు ఇచ్చేందుకు కూడా ప్రభుత్వం చొరవ చూపలేదని అన్నారు. సెప్టెంబరు 12న జరిగిన ఘటనకు అక్టోబర్ 1 వరకు కూడా విద్యార్థులను పరిశీలించిన దాఖలు లేవని దుయ్యబట్టారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ వల్ల 50 వేల మంది కార్మికులు రోడ్డును పడుతున్నారని తెలిపారు. 26 మాసాలుగా వారికి జీతాలు అందలేదని అన్నారు. చోడవరం సుగర్ ఫ్యాక్టరీ రైతులకు బకాయిలు చెల్లించకపోవడంతో వారెంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. రూ.35 కోట్లు బకాయిలు చెల్లించలేరా అని ప్రశ్నించారు. నక్కపల్లి మండలంలో బల్క్ డ్రగ్ పార్కు పేరుతో మత్స్యకారులను ఇబ్బంది పెట్టేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. విశాఖలో 4500 మంది చిరు వ్యాపారులను ఉన్నపళంగా తొలగించారని, వారెలా బతుకుతారని జగన్ ప్రశ్నించారు. ఆయన వెంట మాజీ మంత్రులు బొత్స సత్యనారాయణ, కన్నబాబు, విడుదల రజిని, అమర్‌నాథ్, ఎమ్మెల్సీ వరుధు కల్యాణి, మాజీ ఎమ్మెల్యేలు పెట్ల ఉమాశంకర్ గణేష్, అదీప్‌రాజు, మాజీ ఎంపీ సత్యవతి తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే కురుపాం ఘటన

కురుపాం గురుకుల పాఠశాలలో పచ్చకామెర్ల వ్యాధితో ఇద్దరు విద్యార్థులు మరణించడం, 170 మంది విద్యార్థులు అస్వస్థతకు గురికావడం ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే జరిగిందని జగన్ అన్నారు. మరణించిన ఇద్దరు విద్యార్థుల కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియో, చికిత్స పొందుతున్న వారికి ఒక్కొక్కరికీ రూ.లక్ష చొప్పున పరిహారం చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం రాత్రి కెజిహెచ్‌కు వచ్చిన ఆయన ముందుగా అక్కడ పచ్చ కామెర్ల వ్యాధితో చికిత్స పొందుతున్న 45 మంది విద్యార్థులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ పచ్చకామెర్లు వ్యాధితో మరణించిన ఇద్దరు విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ.5 లక్షలు చొప్పున వైసిపి తరపున అందిస్తామని ప్రకటించారు. బాధిత బాలికల తరుపున కోర్టును ఆశ్రయిస్తామన్నారు. ఆయన వెంట మాజీ ఉప ముఖ్యమంత్రులు పాముల పుష్ప శ్రీవాణి, పీడిక రాజన్న దొర, మాజీ మంత్రులు ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజు, గుడివాడ అమర్‌నాథ్, విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ చిన్న శ్రీను, వైసిపి విశాఖ జిల్లా అధ్యక్షులు కెకె.రాజు, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ ఉన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఆద్యంతం జగన్ పర్యటన హైటెన్షన్ నడుమ సాగింది.

పిపిపిపై మాట్లాడే హక్కు జగన్‌కు లేదు

ప్రజాశక్తి - విశాఖకలెక్టరేట్ : వైద్య కళాశాలలు పిపిపిపై మాట్లాడే నైతిక హక్కు మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి లేదని మాజీ మంత్రి, అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ విమర్శించారు. గురువారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి పాలనలో వైద్యకళాశాలలో 50శాతం సీట్లు ప్రైవేటుగా అమ్ముకున్నారని ఆరోపిం చారు. 2023లో శంకుస్థాపన చేసిన నర్సీపట్నం మెడికల్ కళాశాల నిర్మాణం అప్పటి ప్రభుత్వం ఎందుకు పూర్తి చేయలేదని ఇప్పుడు మొసలి కన్నీరు కారిస్తే ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో అన్ని రంగాలలో కూటమి ప్రభుత్వం ముందుకు పోతుందన్నారు. రాష్ట్రంలో 10 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టడానికి మధుపరులు ఆసక్తి చూపిస్తున్నారని చెప్పారు. ఉత్తరాంధ్రలో గూగుల్ డేటా సెంటర్, గ్రీన్ ఎన్‌టిపిసి, బల్క్ డ్రగ్ ప్రాజెక్టు వంటి పరిశ్రమలు వస్తున్నాయన్నారు. విశాఖ టాటాకన్సల్ట్ సర్వీస్ త్వరలో ప్రారంభం కానుందన్నారు. ఐటీ హబ్‌గా ఉన్న విశాఖ డేటా హబ్‌గా మారనుంది అన్నారు. విశాఖ రైల్వేజోన్, రైల్వే డివిజన్, మెట్రో రైల్ రానుంది అన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో స్టీల్‌ప్లాంట్‌కు రూ.11,440 కోట్లు కేంద్రనిధులు మంజూరయ్యాయన్నారు. సమావేశంలో డిసిసిబి చైర్మన్, జనసేన పిఎసి సభ్యులు కోన తాతారావు, డిప్యూటీ మేయర్ తల్లి గోవిందరెడ్డి, జనసేన ఫ్లోర్ లీడర్ భీశెట్టి వసంత లక్ష్మి, జనసేన ఉత్తర ఇంచార్జ్ పసుపులేటి ఉషాకిరణ్ పాల్గొన్నారు.

మత్స్యకారులకు వర్క్‌షాప్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సిఎంఎఫ్ఆర్ఐ, విశాఖపట్నం ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సాంప్రదాయ మత్స్యకారులతో సంప్రదింపుల వర్క్‌షాప్ గురువారం ఫిషింగ్ హార్బర్‌లో నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ ఎం.ఎన్‌హరేందిరప్రసాద్ మాట్లాడుతూ, సంప్రదాయ మత్స్యకారుల అవసరాలు, వేట విధానాలు, మత్స్యసంపద నాణ్యత, మార్కెటింగ్,సుస్థిర వేట విధానాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు వినియోగించుకోవాలని,అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని సీ ఫుడ్ పెంపకం, కేజ్ పెంపక విధానాల ద్వారా ఉపాధి అవకాశాలు పెంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్రంలోని తీర జిల్లాల నుంచి మత్స్యకారులు, డాక్టర్‌జో కిజకుడన్, డాక్టర్ మధుసూదనరావు, డాక్టర్ మీనానిఫ్నాట్ (సిఎంఎఫ్ఆర్ఐ ప్రధాన శాస్త్రవేత్తలు) జెడి ఫిషరీష్, పి.లక్ష్మణరావు మహంతి(డిడిఎంపెడా) అర్జిల్లి దాస్, హనుమంత రావు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. మత్స్యకారులను నీలియోధులుగా గుర్తించి ఈ సందర్భంగా వారిని కలెక్టర్ సన్మానించారు.

ఐద్వా రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఈ నెల 13, 14, 15 తేదీలలో అనంతపురంలో జరగనున్న ఐద్వా రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ గురువారం సాయంత్రం ఆర్‌కె బీచ్‌లో ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ఎన్.మాధవి, వై.సత్యవతి మాట్లాడుతూ మహిళా హక్కుల కోసం, మెరుగైన విద్య, ఉపాధి, ఆరోగ్యం కోసం, మహిళలపై హింసకు కారణమవుతున్న మద్యం, మత్తు మందుల నిషేధం కోసం ఐద్వా 16వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలన్నారు. జాతీయ నాయకులు మహాసభలకు హాజరవుతారన్నారు. ప్రజల తరుపున రాష్ట్రంలో అన్ని జిల్లాలలో మహిళల పక్షాన పోరాడుతున్న 600 మంది ప్రతినిధులు సభలకు హాజరుకానున్నారని తెలిపారు. మహాసభల తొలిరోజైన 13న భారీ బహిరంగ సభ జరుగుతుందన్నారు. మూడు రోజులపాటు సాంస్కృతిక ఉత్సవాలు ఉంటాయన్నారు. ఈ సభల్లో మూడేళ్ల కాలంలో మహిళా ఉద్యమ అనుభవాలను చర్చించి భవిష్యత్ కార్యాచరణకు పిలుపునిస్తారన్నారు. ఐద్వా పోరాట చరిత్రను వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా చిన్నారులపై, మహిళలపై ఇటీవల అత్యాచారాలు, హత్యలు విపరీతంగా పెరగడంపై ఆందోళన వ్యక్తం చేశారు. సమాజంలో సగభాగంగా ఉన్న మహిళా హక్కులే మానవ హక్కులుగా భావించి మహిళల సంక్షేమం కోసం శ్రమిస్తున్న ఐద్వాకు తోడ్పాడు అందించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బి.పద్మ, ఆర్.వరలక్ష్మి, ఎస్.విజయలక్ష్మి, డి.కొండమ్మ, సిహెచ్.సుమిత్ర, భారతి, కుమారి, అనురాధ, కె.మణి, మౌనిక తదితరులు పాల్గొన్నారు.



బీచ్ రోడ్డులో ప్రచారం నిర్వహిస్తున్న ఐద్వా నాయకులు

మహిళల అభివృద్ధే.. దేశాభివృద్ధి

మహిళల అభివృద్ధే.. దేశ అభివృద్ధి అని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు ఆర్ఎన్.మాధవి అన్నారు. ఐద్వా రాష్ట్ర మహాసభల జయప్రదం కోరుతూ గురువారం ఐద్వా జగదాంబ జోన్ కమిటీ ఆధ్వర్యంలో పందిమెట్టలో ఐద్వా పతాకావిష్కరణ జరిగింది. సంఘం జోన్ అధ్యక్షులు కె.మణి జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో సంఘం జోన్ కార్యదర్శి ఆర్.వరలక్ష్మి, నాయకులు బి.సత్యవతి, సరస్వతి, గౌరీ, లక్ష్మి, మల్లి, పుష్ప, పి.మణి పాల్గొన్నారు.

'సఖి సురక్ష' చికిత్సా కేంద్రాలు ప్రారంభం

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ: ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో భాగంగా పట్టణ ప్రాంతాల్లోని స్వయం సహాయక సంఘ (ఎస్‌హెచ్‌జి) మహిళల ఆరోగ్యం, సామాజిక ఆర్థికశ్రేయస్సును మెరుగుపరచడానికి మెప్మా ఆధ్వర్యంలో 'సఖి సురక్ష' కార్యక్రమాన్ని రూపొందించడం జరిగిందని ఈ సదవకాశాన్ని వినియోగించుకో వాలని విశాఖ జిల్లా కలెక్టర్ ఎమ్.ఎన్.హరేంధిరప్రసాద్ అన్నారు. గురువారం ఆయన మెప్మా ఆధ్వర్యంలో జివిఎంసి యుసిడి విభాగం నిర్వహించిన 'సఖి సురక్ష కార్యక్రమాన్ని విశాఖ తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణబాబు, మెప్మా మిషన్ డైరెక్టర్ ఎన్‌తేజ్ భరత్, యుసిడి ప్రాజెక్ట్ డైరెక్టర్ పిఎం సత్యవేణి, స్టేట్‌మిషన్ మేనేజర్ ఎన్.ఎన్.శ్రీనివాస్, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎన్.సరోజిని, డిఎంహెచ్ఒ విభాగం డాక్టర్ లార్డ్స్ లూసీ, ఇ వైద్య డాక్టర్లతో కలిసి బీచ్ రోడ్డులో ఎయూ కన్వెన్షన్ సెంటర్, సాగరిక హాల్ నందు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు.కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ధ్యేయంగా చేపడుతున్న పథకాల్లో భాగంగా ఎస్‌హెచ్‌జి మహిళల ఆరోగ్య రక్షణకు సఖి సురక్ష' అనే కార్యక్రమాన్ని రూపొందించిన మెప్మా మిషన్ డైరెక్టర్ ఎన్. తేజభరత్ ను అభినందించారు. ఎస్ఎస్‌జి మహిళలు నిరంతరం వారి విధులు నిర్వహణలో నిమగ్నమై ఆరోగ్యం పట్ల శ్రద్ధ కలిగి ఉండటం లేదని భావించి వారి ఆరోగ్య రక్షణకు సురక్ష కవచంగా ఈ కార్యక్రమం మొట్టమొదటిసారిగా నేడు విశాఖలో ప్రారంభించడం జరిగిందన్నారు. 35 సంవత్సరాలు పైబడిన ఎస్‌హెచ్‌జి మహిళలు ఆరోగ్య పరీక్షలు చేసుకోవచ్చని, ఈనెల 26 వరకు నగరంలో గాజువాక, అనకాపల్లికి ఒక కేంద్రం, మధురవాడ, భీమిలికి ఒక కేంద్రం, పెందుర్తి జ్ఞానాపురం ప్రాంతాలకు ఒక కేంద్రం మొత్తంగా కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించబడతాయని పదహారురకాల పరీక్షలు కేంద్రాల్లో జరుగుతాయన్నారు.

ఈ సదవకాశాన్ని ఎస్‌హెచ్‌జి మహిళలు తప్పకుండా వినియోగించుకోవాలని ఆయుష్మాన్ భారత్ పథకం కింద ఐదు లక్షల వరకు ఆరోగ్య భీమా కల్పించనున్నట్టు కలెక్టర్ తెలిపారు.

తూర్పు నియోజకవర్గం శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించి విశాఖ ప్రపంచ ఖ్యాతిని పొందిందని చెప్పారు.

IN THE HONOURABLE COURT OF II ADDL. CIVIL JUDGE (SENIOR DIVISION) AT VISAKHAPATNAM
I.P.40/2023

Between:
Smt. Pottu Lakshmi ...**Petitioner**
And:
Thota Ammaji and 10 others
...**Respondents**
To
R-2.Smt. Dharmala Sanyasamma
W/o late Venkata Rao, Residing at D.No.43-17-23 & 24, Venkataraju Nagar, Dondaparthy
Visakhapatnam 530 016
R-3. Smt. Barri Srinnamma
W/o Appa Rao, D.No.43-19-22/1, Kuppili vari veedhi, Dondaparthy, Visakhapatnam 530 016.

NOTICE

Whereas the above named Petitioner filed IP against above said Respondents. That you are hereby summoned to appear before the Honourable Court either in person or by a pleader duly instructed and able to answer all material questions relating to the IP or who shall be accompanied by some person able to answer all such questions on **04.11.2025 at 10:30 A.M.,** to answer the claim. Take notice that in default of your appearance on the day before mentioned, the IP will be heard and determined in your absence.

GSVS Damodara Rao
Advocate,
#43-4-14/1, Nandhini Residency,
Railway New Colony,
Visakhapatnam 530 016.

NOTICE TO HANDOVER THE KEYS OF LEASE PREMISES

To **Gudala Divya Priyadarshini,**
W/o G. Krishna Murthy, Director,
Wesley World Evengelism, E3,
Jewal apartment, Pedarushikonda,
Visakhapatnam 530045, AP.
Phone-6301838624.

I SRINIVASA REDDY CHETLA S/o Ch. Dasu Reddy, am the owner of the below schedule premises and I have given the said premises for lease to you on 6-12-2021, on month to month tenancy and you have executed a lease agreement also. But you have failed to pay rents for past several months and kept rents due to a total of Rs. 6,95,994/- Despite several demands, you have neglected to clear the due rents. I have come to learnt that on 31-08-2025 you have already vacated the premises under lock and key without handing over the keys to me and when I tried to contact you over phone, you are not lifting my phone calls and evading.

Therefore, you are hereby demanded to clear all the arrears of rents Rs. 6,95,994/- till today and hand over the keys in 2 days from this notice, failing which I will take necessary action to break open the premises doors and locks and take the physical possession, since you have already violated the lease terms and vacated my property without handing over keys. Hence this notice.

SCHEDULE OF LEASE HOLD PREMISES

All that site measuring 124 Sq.yards or 103.680 Sq.meters being undivided and unspecified share out of the total extent of the site measuring 1774 Sq. yards or 1483.29 Sq. meters together with Western part of Third Floor with the Super built up area of 4127 sft (inclusive of common areas) and Three Car Parkings each measuring 100 sft in Sub Cellar Floor of 'SURBHI SURAJYA ARCADE' in Plot No.5 covered by 5.Nos.6113 & 6113BP of Maddilapalem Village, within the limits of Greater Visakhapatnam Municipal Corporation and Visakhapatnam Registration Sub District
Boundaries of Western Part of Third Floor:
East: Remaining part of Third Floor belongs to Vendor No.1
South: Open Space facing NH-5 Road
West: Staircase, Lift and Common Corridor
North: Open Space

SRINIVASA REDDY CHETLA
S/o Ch. Dasu Reddy, 53-17-52/9, Maddilapalem, Visakhapatnam
Visakhapatnam
Dt. 9-10-2025

IN THE COURT OF THE VIII ADDITIONAL DISTRICT JUDGE AT VIJAYAWADA
O.S.NO. 20/2025

BETWEEN
Maddineni Murali Krishna ...Plaintiff
AND
Ramavath Nageswara Naik ... Defendant
To:
Defendant- Ramavath Nageswara Naik, s/o Venkateswara Naik r/o Dr.No.31-57-2/3, Lotus Food Plaza, Sai Ganesh Nagar, Vadlapudi post, Visakhapatnam-530046.

WHEREAS the above named Plaintiff has filed a Suit against you for recovery of an amount of Rs.1,04,71,747. You are hereby either appear in person or appear through an Advocate on the 16-10-2025 at 10.30 A.M in the above court, failing which you will be set exparte and the matter will be decided in your absence.

(By Order of the Hon'ble Court)
Smt. Kilaru Sarala Benarjee
Advocate, Vijayawada

మహారాజశ్రీ విశాఖపట్నం ఫ్యామిలీ జడ్జి కమ్ 5వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
F.C.O.P. 66/2025

బిట్వీన్:
బమ్మిడి (నంబల) ప్రియాంక ...పిటీషనర్
అండ్
బమ్మిడి కార్తీక్ ...రెస్పాండెంటు

నోటీసు

టు
రెస్పాండెంటు:
బమ్మిడి కార్తీక్, S/o. లేటు అంబరీష్, హిందు, వయస్సు: 38 సం॥లు, నివాసం: డోర్ నెం. 11-193/10, నరసింహ ఎన్‌క్లేవ్, ప్రహ్లాదపురం, చంద్రపూరి కాలనీ, సాయిబాబా గుడి దగ్గర, విశాఖపట్నం-530027.

పైనెంబరు పిటీషన్‌లో పైతెలిపిన పిటీషనర్‌గారు మీపై విడాకుల కొరకు పిటీషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటీషన్ నందు కోర్టు ద్వారా పంపిన నోటీసులు అందుకొనని కారణంగా ఈ పేపరు ప్రకటన ద్వారా మీకు నోటీసు జారీచేసియున్నారు. కావున పైపిటీషన్‌లో మీ హాజరు కొరకు **తేది. 29-10-2025**న వాయిదా అయివున్నది. ఆ దినమున మీరు **ఉ॥గం॥10.30ని॥**లకు స్వయంగాగానీ, వకీలు గారి ద్వారాగాని పై తెలిపిన శ్రీ కోర్టులో హాజరై మీ ఆక్షేపణలను తెలియజేసుకొనవలెను. లేనియెడల పై పిటీషన్‌లో మీకు ఎటువంటి ఆక్షేపణలులేవని భావించి శ్రీ కోర్టు వారు మీపరోక్షమందు తీర్మాణించెదరని ఇందుమూలంగా మీకు తెలియజేయడమైనది.

(By Order of the Hon'ble Court)
K. DEMUDU (BABU), Advocate
Visakhapatanam, **Cell: 9948090824**

మహారాజశ్రీ విశాఖపట్నం ఫ్యామిలీ జడ్జి కమ్ 5వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
F.C.O.P. 508/2024

బిట్వీన్
శ్రీ మక్కా శివ కుమార్ ...పిటీషనర్
అండ్
శ్రీమతి మక్కా (అల్లూరి) గీతిక రెడ్డి @ షణ్ముఖి ...రెస్పాండెంట్

నోటీసు

టు
రెస్పాండెంటు:
శ్రీమతి మక్కా (అల్లూరి) గీతిక రెడ్డి @ షణ్ముఖి, W/o. మక్కా శివకుమార్, D/o. అల్లూరి వెంకట రమణారెడ్డి, హిందు, వయస్సు: 23 సం॥లు, నివాసం: డోర్ నెం.46-20-32/1, రామాలయం వీధి, దొండపర్తి, విశాఖపట్నం-530016.

పైనెంబరు పిటీషన్‌లో పై తెలిపిన పిటీషనర్‌గారు మీపై విడాకుల కొరకు పిటీషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటీషన్ నందు కోర్టు ద్వారా పంపిన నోటీసులు అందుకొనని కారణంగా ఈ పేపరు ప్రకటన ద్వారా మీకు నోటీసు జారీచేసియున్నారు. కావున పైపిటీషన్‌లో మీ హాజరు కొరకు **తేది. 28-10-2025**న వాయిదా అయివున్నది. ఆ దినమున మీరు **ఉ॥గం॥10.30ని॥**లకు స్వయంగాగానీ, వకీలు గారి ద్వారాగాని పై తెలిపిన శ్రీ కోర్టులో హాజరై మీ ఆక్షేపణలను తెలియజేసుకొనవలెను. లేనియెడల పై పిటీషన్‌లో మీకు ఎటువంటి ఆక్షేపణలు లేవని భావించి శ్రీ కోర్టు వారు మీ పరోక్షమందు తీర్మాణించెదరని ఇందు మూలంగా మీకు తెలియజేయడమైనది.

T. ANANDA RAO, Advocate
Visakhapatnam. **Cell: 9949251626**

అపారిశుధ్యమే కారణమా?

కొయ్యపేటలో డయేరియా కలకలం



చెరువులో పేరుకుపోయిన వ్యర్థాలు

ప్రజాశక్తి-పద్మనాభం : పద్మనాభం మండలంలోని నేరెళ్లవలస పంచాయతీ పరిధి కొయ్యపేట గ్రామంలో అపారిశుధ్యం తాండవిస్తోంది. దీంతో ప్రస్తుతం డయేరియా వ్యాప్తి చెందుతోంది. 200 కుటుంబాలు నివాసముంటున్న ఈ గ్రామంలో ప్రస్తుతం సుమారు 17 మంది డయేరియా లక్షణాలతో బాధపడుతున్నారు 50 సంవత్సరాలు పైబడిన వారిలోనే ఈ లక్షణాలు కనిపిస్తున్నాయి. ఈ నెల 4వ తేదీన విజయనగరంలోని మహారాజా ప్రభుత్వ ఆసుపత్రిలో ఓ రైతుకు చేసిన పరీక్షలో ఈ వ్యాధి లక్షణాలు బయటపడ్డాయి.

కొనసాగుతున్న వైద్య శిబిరం

కొయ్యపేటలో డయేరియా లక్షణాలు గుర్తించిన తర్వాత మండలంలోని రేవిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యాన ఉచిత వైద్య శిబిరాన్ని కొనసాగిస్తున్నారు. గురువారం గ్రామానికి చెందిన జి.నారాయణమ్మ (80)కు వాంతులు, వి ేం చ ే న ా ల ు ప్రారంభమయ్యాయి. స్థానిక వైద్యులు సకాలంలో వైద్య స ద ు పా య ా ల ు అందించడంతో ప్రస్తుతం ఇంటివద్దే ఆమె చికిత్స పొందుతున్నారు.

ఈ నెల 4 నుండి 8వ తేదీ వరకు 16 మంది డయేరియా లక్షణాలతో విజయనగరంలోని మహారాజా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందారు. 13 మంది డిశ్చార్జ్ అయ్యారు, ఇంకా ముగ్గురు ఆ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అదే గ్రామానికి చెందిన ఆశ వర్కర్ జి.రమణమ్మ కూడా ఈ వ్యాధి బారిన పడి ఇంటి వద్ద వైద్యం పొందుతున్నారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి బాగానే ఉంది.

గ్రామంలో గత ఆరు నెలలుగా కాలువల్లో ఉన్న మురుగు నీటిని తొలగించకపోవడం వల్ల దుర్వాసన రావడంతో ఈగలు, దోమలు విపరీతంగా పెరిగి నివాస ప్రాంతాల్లో ఉన్న ఆహారాలపై వాలడం ద్వారా ఈ వ్యాధి వచ్చినట్లు గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు. గ్రామానికి ఆనుకుని ఉన్న కోనేరు పూర్తిగా నిండిపోయి ఉందని, గ్రామంలోని కాలువల నీరు కోనేరులోకి వెళ్లే అవకాశం లేక నిల్వ చేరడంతో మురిగిపోయి దుర్వాసన వస్తోందని స్థానికులు చెబుతున్నారు.



కాలువలో పేరుకుపోయిన మురుగు



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసి 1, 2 వార్డుల్లో రూ1.12 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు గురువారం శంకుస్థాపన చేశారు. ఒకటో వార్డులో రూ.46 లక్షలతో, రెండో వార్డులో రూ.85 లక్షలతో రోడ్లు, డ్రెయిన్లను నిర్మించనున్నట్లు ఆయన తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి పనులు వేగవంతమయ్యాయన్నారు. కార్యక్రమంలో రెండో వార్డు కార్పొరేటర్ గాడు చిన్ని కుమారిలక్ష్మి, టిడిపి భీమిలి మండల అధ్యక్షులు సరగడ అప్పారావు, టిడిపి, జనసేన నాయకులు తమ్మిన సూరిబాబు, కొప్పల కృష్ణ, గరే సదానంద, పి.భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ జట్టుకుఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ జట్టుకు ఆనందపురం విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి -ఆనందపురం: ఆనందపురం ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ ఎస్‌జిఎఫ్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.కామేశ్వరరావు తెలిపారు. పదో తరగతి విద్యార్థులు డి.సాయితేజ, డి.దీక్షిత సాఫ్ట్‌బాల్ జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను వ్యాయామ ఉపాధ్యాయులు ఎస్.నరసింహమూర్తి, వి.బుజ్జి, వైఎఆర్‌కె.ప్రసాద్ అభినందించారు. విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీల్లో విజయం సాధించి పాఠశాలకు గౌరవం తీసుకురావాలని ప్రధానోపాధ్యాయులు ఆకాంక్షించారు.

వృద్ధాప్యంలో జాగ్రత్తలపై అవగాహన

ప్రజాశక్తి - ఆరిలోవ : అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎల్‌వి.ప్రసాద్ నేత్ర వైద్యశాల వయోవృద్ధుల నేత్ర సంరక్షణ కేంద్రంలో వృద్ధాప్యంలో తీసుకోవలసిన జాగ్రత్తల పట్ల గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వృద్ధులను సాదరంగా ఆహ్వానించి, వారికి పుష్పగుచ్ఛాలు అందించి నిర్వాహకులు స్వాగతం పలికారు. వేడుకలకు గుర్తుగా వారితో కేక్ కట్ చేయించి, కాఫీ, టి, బిస్కెట్లు అందజేసారు. వృద్ధులతో కుండీల్లో మొక్కలు నాటించారు. అటపాటలతో సందడి చేసి వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎల్‌వి ప్రసాద్ నేత్ర సంరక్షణ విభాగధిపతి డాక్టర్ అవినాష్ పతేంగే మాట్లాడుతూ, వృద్ధుల నేత్ర సంరక్షణలో చేర్చడం ద్వారా వృద్ధాప్యంలో వచ్చే నేత్ర సమస్యల పట్ల అవగాహన కల్పించి, వారికి చికిత్సలు అందిస్తాయన్నారు.

పేద కుటుంబానికి సాయం

ప్రజాశక్తి-మధురవాడ : ఎంవిపి.కాలనీ సెక్టార్ 4లో 20 ఏళ్లుగా బట్టలు ఇస్త్రీ చేసుకుంటూ జీవనోపాధి సాగిస్తున్న ఈశ్వరరావు కుటుంబానికి గంటా రవితేజ ఇస్త్రీ పెట్టె అందించడంతో పాటు షాపును గురువారం ఏర్పాటుచేయించారు. కొత్త షాపు ఏర్పాటుతో ఎవరిపైనా ఆధారపడకుండా ఈశ్వరరావు గౌరవప్రదమైన జీవితాన్ని గడపాలని ఆయన ఆకాంక్షించారు.



రజక కుటుంబానికి షాపు ఏర్పాటుచేసి అందించిన గంటా రవితేజ

అడవి మొక్కలో ఔషధ గుణాలు

ఫెరాన్లపై పరిశోధనలో గీతం స్కాలర్‌కు డాక్టరేట్





డాక్టరేట్ పొందిన గీతం స్కాలర్ శ్రావణి

ప్రజాశక్తి-మధురవాడ : అడవి మొక్కగా పిలిచే ఫెర్న్ జాతి మొక్కలలో అద్భుతమైన ఔషధ గుణాలు ఉన్నాయని, మధుమేహ వ్యాధి చికిత్సలో ఈ మొక్కలోని విశేష గుణాలు ఉపయోగపడగలవని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఔషధ శాస్త్ర పరిశోధకులు డాక్టర్ టి.శ్రావణి నిరూపించారు. గీతం స్కూల్ ఆఫ్ ఫార్మశీ ప్రొఫెసర్ డాక్టర్ పార్థ రాయ్ పర్యవేక్షణలో శ్రావణి జరిపిన పరిశోధనకు గీతం విశ్వవిద్యాలయం డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (పిహెచ్‌డి) డిగ్రీని ప్రకటించింది. "ఫార్మకోగ్నొస్టిక్ స్టడీస్, ఐసోలేషన్ ఆఫ్ ఫైటో-కాన్సిట్యూయెంట్స్, అండ్ బయాలాజికల్ ఇవాల్యుయేషన్ ఆన్ ఏరియల్ పార్ట్స్ ఆఫ్ ది ఫెరన్స్" అనే అంశంపై ఆమె చేసిన పరిశోధన ఇప్పటికే ప్రముఖ జర్నల్స్‌లో ప్రచురితమైంది.

ఈ సందర్భంగా డాక్టర్ శ్రావణి తన పరిశోధన వివరాలను తెలియజేస్తూ ఈ మొక్కలో ఉండే టానిన్లు, సాపోనిన్లు, ఆల్కలాయిడ్లు, ఫినోలిక్స్, ఫ్లావనాయిడ్స్ వంటి సెకండరీ మెటబోలైట్స్ వ్యాధినిరోధక, కాలేయ రక్షణ, గర్భనిరోధక, జీర్ణ సమస్యల నివారణ, అల్సర్ వ్యతిరేక, జ్వర నివారణ వంటి ఔషధ గుణాలను కలిగి ఉన్నాయని వెల్లడించారు. ప్రస్తుతం శ్రావణి హైదరాబాద్‌లోని బొటానిక్ హెల్త్‌కేర్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో టెక్నికల్ విభాగం మేనేజర్‌గా పనిచేస్తున్నారు.

పాఠ్య పుస్తకాలు అందకపోవడంపై నిలదీత

ప్రజాశక్తి- భీమునిపట్నం : ఈ ఏడాది విద్యాసంత్సరం ఆరంభమై దాదాపు నాలుగు నెలలు పైబడినా 6వ తరగతి చదువుతున్న తమ పిల్లలకు పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్ ఇవ్వక పోవడంపై కొందరు తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ గురువారం స్థానిక జివిఎంసి పిఎన్ఎం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు తిరుమల శ్రీదేవిని, ఉపాధ్యాయుల్ని ప్రశ్నించారు. సాంకేతికంగా ఏర్పడిన సమస్య కారణంగా ఆరో తరగతి విద్యార్థులకు సకాలంలో పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ ఇవ్వలేక పోయామని ప్రధానోపాధ్యాయులు వివరించారు. ఈ విషయాన్ని స్థానిక విలేకర్లు ఎంఇఒ-2 జయప్రద వద్ద ప్రస్తావించగా సంబంధిత పాఠశాలలో ఈ ఏడాది ఆరో తరగతిలో ప్రవేశాలు ఎక్కువగా జరిగాయని, గతేడాది విద్యార్థుల సంఖ్య ఆధారంగానే పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ సరఫరా అయ్యాయని వివరించారు. పుస్తకాల డిపో వద్ద పాఠ్య పుస్తకాలు అందుబాటులో ఉంటే సర్దుబాటు చేసే ప్రయత్నం చేస్తామని తెలిపారు. ఇదే పాఠశాలలో 71 మంది 6వ తరగతి విద్యార్థులకు గాను కేవలం 12 మందికే పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్ అందాయని కొందరు తల్లి దండ్రులు తెలిపారు.



పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్ అందని విద్యార్థులు



యోగా పోటీలను ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్ మురళీకృష్ణ

యోగా జట్టు ఎంపిక పోటీలు

ప్రజాశక్తి -తగరపువలస : అవంతి ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో గురువారం సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ బాలికల యోగా జట్టు ఎంపిక పోటీలు నిర్వహించారు. ముందుగా కళాశాల ప్రిన్సిపల్ మురళీకృష్ణ జ్యోతి వెలిగించి పోటీలు ప్రారంభించారు. విజయనగరం జవహర్ లాల్ నెహ్రూ టెక్నాలజీ యూనివర్సిటీ పరిధిలో ఉన్న పలు కళాశాలల బాలికలు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన బాలికల జట్టు బెంగళూరులో స్వామి వివేకానంద యోగా కేంద్రంలో జరుగనున్న ఇంటర్ యూనివర్సిటీ యోగా టోర్నీలో పాల్గొంటారని ప్రిన్సిపల్ తెలిపారు. యోగా ద్వారా ఆరోగ్యం సమకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అవంతి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రామకృష్ణ, స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ రాము, ఆర్గనైజింగ్ సెక్రటరీ కోలా చంద్రశేఖర్, ఆర్గనైజర్ గాయిత్రి తదితరులు పాల్గొన్నారు.



అదనపు ప్రభుత్వ ప్లీడర్‌గా వరప్రసాదరావు

ప్రజాశక్తి-లీగల్ : విశాఖపట్నంలోని జిల్లా కోర్టులు, సీనియర్ సివిల్ జడ్జి కోర్టుల్లో ప్రభుత్వం తరపున కేసులు వాదించుటకు అదనపు ప్రభుత్వ న్యాయవాదిగా నగరానికి చెందిన సీనియర్ అడ్వకేట్ డివిఎస్‌కె.వరప్రసాదరావును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. గురువారం జిల్లా కోర్టులోని తనకు కేటాయించిన కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. మూడేళ్లపాటు ఈ బాధ్యతల్లో ఉంటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం తరపున సివిల్ కేసుల్లో అత్యంత పారదర్శకంగా త్వరగా తీర్పులు వచ్చేటట్లు చేస్తానని చెప్పారు. వరప్రసాద్ నియామకం పట్ల జిల్లా న్యాయవాదుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎంకె.శ్రీనివాస్, ఎల్.పార్వతీనాయుడు, సీనియర్ న్యాయవాదులు బగాది తులసీదాస్, హరిహర రెడ్డి తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

'శ్రీకృష్ణార్జున యుద్ధం' ప్రదర్శన

ప్రజాశక్తి- మాధవధార : విశాఖపట్నం పోర్టు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా విశాఖపట్నం పోర్టు అథారిటీ, హార్బర్ అండ్ పోర్టు పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్తంగా శ్రీకృష్ణార్జునయుద్ధం అనే పద్య నాటకాన్ని శ్రీ సీతారామ కల్యాణ మండపంలో ప్రదర్శించారు. హార్బర్ అండ్ పోర్టు పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు చౌదరి అప్పారావు అధ్యక్షతన జరిగిన ప్రదర్శనను ముఖ్య అతిథులుగా రిటైర్డ్ ట్రాఫిక్ మేనేజర్ కె.సత్యనారాయణరావు, గంట అప్పలనాయుడు, రిటైర్డ్ ఫోర్‌మ్యాన్ నూనెల అప్పారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రముఖ కళాకారులు పివిఐ.సత్యనారాయణమూర్తిని ఘనంగా సత్కరించారు. పోర్టు ఉద్యోగులు, డిఎల్‌బి ఉద్యోగులు, కళాకారులు, కళాభిమానులు పాల్గొని నాటకాన్ని తిలకించారు. ఈ కార్యక్రమంలో అన్నెపు నారాయణరావు, పులి శివప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న జస్టిస్ పివి.రెడ్డి

ప్రజాశక్తి-వేపగుంట : శ్రీవరాహలక్ష్మీనృసింహస్వామిని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పివి.రెడ్డి గురువారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ సహాయ కార్య నిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు స్వాగతం పలికారు. జస్టిస్ పివి.రెడ్డి ముందుగా కప్పస్తంభాన్ని అలింగనం చేసుకున్నారు. అనంతరం స్వామిని దర్శించుకున్నారు.

రైల్వే భవనాలను సందర్శించిన గణబాబు

ప్రజాశక్తి -గోపాలపట్నం : అమృత్ భారత్ స్కీమ్‌లో భాగంగా సింహాచలం రైల్వేస్టేషన్‌లో నిర్మిస్తున్న భవనాలను స్థానిక ఎమ్మెల్యే గణబాబు గురువారం సందర్శించారు. బిఆర్‌టిఎస్ సదరం అప్పలనాయుడు మార్గం నుంచి రైల్వే స్టేషన్ లోపలకు వెళ్లడానికి ప్రత్యామ్నాయ మార్గాన్ని సూచించారు. జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రైల్వే సిబ్బంది, జోన్ 8 -జోనల్ కమిషనర్, ఎడి అప్పన్న బాబు, జీన్స్ వేర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వెల్లంకి హైస్కూల్లో ఆధార్ సేవలు

ప్రజాశక్తి-ఆనందపురం : వెల్లంకిలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో తపాలా శాఖ ఆధ్వర్యంలో ఆధార్ సేవలు గురువారం ప్రారంభమయ్యాయి. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులందరికీ ఫింగర్ ప్రింట్స్, ఫొటో అప్‌డేషన్, పేరు, పుట్టిన తేదీల్లో సవరణలు తదితరాలను చేపట్టారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ కంచరాపు శ్రీనివాస్, ఎంపిటిసి పడాల అప్పలనాయుడు, జనసేన నాయకులు గోవింద్ బాల, ప్రధానోపాధ్యాయులు దాడిశెట్టి రమేష్‌కుమార్ పాల్గొన్నారు.

న్యూ ఆమ్నెస్టీ స్కీమ్‌పై అవగాహన

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం చిప్పాడ డివిజన్‌లో గురువారం న్యూ ఆమ్నెస్టీ స్కీమ్‌పై అవగాహన కల్పించారు. ఈ పథకం వల్ల కలిగే ప్రయోజనాలను కార్మిక బీమా సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ వేమూరి శ్యామ్ ప్రసాద్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఇఎస్‌ఐ సూపరింటెండెంట్ పి.శ్రీనివాస్, మేనేజర్ అజీజ్ బేగ్, డివిజన్ జిఎలు వైఎస్.కోటేశ్వరరావు, ఎంఎస్ఎన్.రావు, సిబ్బంది పాల్గొన్నారు.

కెజిబివిలో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - ఆనందపురం : ఆనందపురం మండలం నేలతేరు గ్రామంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు డి.కాంతారావు, జిసిడిఒ శ్రీదేవి, ఎఎస్ఎల్ శ్రీనివాసరావు తనిఖీ చేశారు. రికార్డులు, వంటశాల, వండిన పదార్థాలను పరిశీలించారు. విద్యార్థుల వసతి గృహాలు, వాష్‌రూమ్‌లను కూడా పరిశీలించారు. పరిశుభ్రతా ప్రమాణాలు మెరుగ్గా ఉన్నాయని అభినందించారు.

ఎగిసే విప్లవ కెరటం చేగువేరా

ప్రజాశక్తి-సీతమ్మధార : ఎగిసే విప్లవ కెరటం చేగువేరా అని, ఆయనను యువత ఆదర్శంగా తీసుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాజు కోరారు. ఆయన స్ఫూర్తితో రైల్వే జోన్, వెనుకబడిన ఉత్తరాంధ్రకు ప్యాకేజీ కోసం యువత పోరాటాలలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. చేగువేరా వర్ధంతి సందర్భంగా ఎఎస్ఆర్.కాలనీ నందు చేగువేరా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు శ్రావణ్ మాట్లాడుతూ, నాడు అమెరికా సామ్రాజ్యవాదానికి ఎదురొడ్డి క్యూబా పోరాటంలో కీలకపాత్ర పోషించిన వీరుడు చేగువేరా అన్నారు. డాక్టర్ వృత్తిలో వుండి పేదల కోసం అహర్నిశలు కష్టపడి, గెరిల్లా పోరాట ఉద్యమాలు నిర్వహించి సామ్రాజ్యవాదుల చేతిలో వీర మరణం పొందారని గుర్తుచేశారు. చేగువేరాను అందరూ చే అని పిలుస్తారని తెలిపారు. 1967 అక్టోబర్ 9న అమెరికా సామ్రాజ్యవాదుల చేతిలో వీర మరణం పొందారని తెలిపారు. ప్రస్తుతం యువతను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నాయని విమర్శించారు. మతోన్మాదం పేరుతో నేడు దేశంలో అణగారిన వర్గాలపై దాడులు జరుగుతున్నాయని, అత్యాచారాలు ఎక్కువయ్యాయని తెలిపారు. వీటిని అరికట్టడంలో పాలకులు విఫలం చెందారు అన్నారు. చే ఒక దేశానికో, ఒక వర్గానికో పరిమితం కాదని, యావత్ ప్రపంచానికి ఆయన ఒక రోల్ మోడల్ అని పేర్కొన్నారు. యువత టీ షర్ట్‌పై, బైకులపై ఆయన బొమ్మ వేసుకుంటే సరిపోదని, ఆయన ఆదర్శాలను పాటించాలని కోరారు. హక్కుల కోసం పోరాడేందుకు ఆయన ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జోన్ నాయకులు కోటి, దుర్గా కాలనీ అధ్యక్షులు గౌరీష్ తదితరులు పాల్గొన్నారు.



చేగువేరా చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

టిడ్కో ఇళ్ల పరిశీలన



టిడ్కో ఇళ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

ప్రజాశక్తి -గోపాలపట్నం : జివిఎంసి 92వ వార్డు పరిధి పద్మనాభనగర్, ములగాడలో నిర్మిస్తున్న టిడ్కో ఇళ్లను ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే గణబాబు, డిసిసిబి ఛైర్మన్ కోన తాతారావు, ప్రభుత్వ అధికారులు కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రంలో టిడ్కో ఇళ్ల నిర్మాణం శరవేగంగా జరుగుతుందన్నారు. త్వరలో లబ్ధిదారులకు అందిస్తామని తెలిపారు. కోన తాతారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ శంకరరావు, రాము, డి.నరసింహమూర్తి, శ్రీహరి, సుధాకర్ పాల్గొన్నారు.

చెవుడుపై అవగాహన

ప్రజాశక్తి-సీతమ్మధార : ఇంటర్నేషనల్ వీక్ ఆఫ్ డెఫ్ పీపుల్ సందర్భంగా చెవుడుపై అవగాహన ప్రచార కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్య కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేశారు. జిల్లా ఎన్‌సిడి ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ హరిణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డెఫ్ అండ్ డంబ్ అసోసియేషన్ జిల్లా సలహాదారు వి.లక్ష్మి ప్రత్యేకంగా శిక్షణ అందించారు. ఈ శిక్షణలో ఎన్‌సిడి మెడికల్ ఆఫీసర్లు, ఫిజియోథెరపిస్టులు, ఎఎన్ఎమ్‌లు, ఆశా కార్యకర్తలు, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు. బధిరులకు ఎదురయ్యే సమస్యలు అవసరాలు, వారికి అందాల్సిన వైద్య సేవలపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ ఉద్దేశ్యమని వి.లక్ష్మి తెలిపారు. 'చూపులతో మాట్లాడే వారి కోసం మనం వినిపించాలి" అనే నినాదంతో ఈ అవగాహన కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు.

వైభవంగా స్వర్ణ పుష్పార్చన

ప్రజాశక్తి-వేపగుంట : సింహాచల పుణ్య క్షేత్రములో దేవస్థాన పండితుల వేదమంత్రాల, నాదస్వర మంగళ వాయిద్యాలతో శాస్త్రోక్తంగా స్వర్ణ పుష్పార్చన వైభవంగా నిర్వహించారు. అర్చకులు వేకువ జామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ప్రాత్యకాల పూజలు సాంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ గోవిందరాజు స్వామి వారిని సర్వాంగ సుందరంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపములో వేదికపై అధిష్టింపజేశారు.

తల్లీబిడ్డ ఆరోగ్యానికి పోషకాహారం

ప్రజాశక్తి - ఆనందపురం : కడుపులో పెరుగుతున్న శిశువు ఆరోగ్యానికి ప్రభుత్వం అందిస్తున్న పోషక పదార్థాలు తీసుకోవాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. ఆనందపురం మండల కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన 8వ రాష్ట్రీయ పోషక మాసం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పుట్టబోయే బిడ్డకు కావాల్సిన పోషకాలను శాస్త్రీయంగా ఎంపిక చేసి ఇస్తున్నారని తెలిపారు. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 16 వరకు జరిగే ఈ కార్యక్రమాన్ని గర్భిణులు వినియోగించుకోవాలని సూచించారు. ఆరోగ్యకరమైన పిల్లలు పుట్టాలని ఆశీర్వదిస్తూ ప్రభుత్వం తరపున సీమంతం నిర్వహించారు. ప్రభుత్వపరంగా అందిస్తున్న చిరుధాన్యాల హల్వా, చిక్కి తదితరాల నాణ్యతను పరిశీలించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ పిఒ శ్రీదేవి, తహశీల్దార్ శ్రీనుబాబు, టిడిపి మండల అధ్యక్షుడు తాట్రాజు అప్పారావు, కార్పొరేటర్లు పివి.నరసింహం, లొడగల అప్పారావు, కూటమి నేతలు చిక్కాల విజయ్‌బాబు, ఎఎంసి ఛైర్మన్ రామస్వామినాయుడు, బిఆర్‌బి.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్‌కు నమూనా పరీక్ష

ప్రజాశక్తి -తగరపువలస : చిట్టివలస జెడ్‌పి హైస్కూల్‌లో ఎన్ఎంఎంఎస్ - 25 పోటీ పరీక్షలకు హాజరు కానున్న 8వ తరగతి విద్యార్థులకు నమూనా పరీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాలుర, బాలికల జెడ్‌పి హైస్కూల్స్ ప్రధానోపాధ్యాయులు డి.ఆదినారాయణ, శివజ్యోతి, గణిత ఉపాధ్యాయులు వంగపండు దుష్యంత్, ఫ్రెండ్స్ ఎడ్యుకేషన్ సొసైటీ ప్రధాన కార్యదర్శి రేఖ అప్పారావు తదితరులు పాల్గొన్నారు

సన్‌రైజ్‌లో మూడు అరుదైన కేసులకు చికిత్స

ప్రజాశక్తి -గాజువాక : గాజువాకలోని సన్‌రైజ్ చిల్డ్రన్ హాస్పిటల్‌లో మూడు అరుదైన కేసులను విజయవంతంగా చేసినట్లు హాస్పిటల్ ఎమ్‌డి డాక్టర్ టి.తిరుపతిరావు తెలిపారు. గురువారం ఆసుపత్రిలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆ కేసులకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. గత రెండు నెలల్లో సన్‌రైజ్ చిల్డ్రన్ హాస్పిటల్ పిడియాట్రిక్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ బృందం సభ్యులు మూడు ప్రాణాపాయమైన, అరుదైన కేసులకు విజయవంతంగా చికిత్స అందించి ప్రాణాలు కాపాడినట్లు తెలిపారు. డోంపెరిడోన్‌ను అధిక మోతాదులో తీసుకోవడంతో తీవ్రమైన గుండె సమస్యలతో వచ్చిన 7 ఏళ్ల బాలుడిని వెంటిలేటర్‌పై ఉంచి సమయానుకూల చికిత్స అందించి కాపాడినట్లు తెలిపారు.

డెంగ్యూ తరహా వైరల్ జ్వరానంతరం సీజర్స్, అవగాహనలో మార్పు, తాత్కాలిక దృష్టి కోల్పోవడం వంటి లక్షణాలతో వచ్చిన 9 ఏళ్ల బాలుడిని యాంటీ కన్వల్సెంట్స్, స్టెరాయిడ్స్, ఐవిఐజితో చికిత్స చేసి కాపాడినట్లు తెలిపారు.

జ్వరానంతరం న్యూరోలాజికల్ సమస్యలతో వచ్చిన 5 ఏళ్ల బాలుడికి హైడోస్ స్టెరాయిడ్ చికిత్స ఇచ్చి పూర్తిగా కోలుకునేలా చేశామని తెలిపారు. ఇలాంటి క్లిష్టమైన వైద్యం చేయడం చాలా సాహసోపేతమైనదన్నారు. ఇలాంటి కేసుల్లో తమ వైద్య బృందం కష్టపడి విజయం సాధించినట్లు తెలిపారు. రోగ కారణాలు వెంటనే నిర్ధారణ చేయడం, సమయానికి సరైన చికిత్స అందించడం, టీం వర్క్‌గా పని చేయడం వల్ల విజయం సాధించినట్లు చెప్పారు. హాస్పిటల్ పెట్టినప్పటి నుండి నేటి వరకు ఇలాంటి కష్టమైన ఎన్నో కేసులను విజయవంతంగా పూర్తిచేసినట్లు గుర్తు చేశారు. డబ్బు కంటే ప్రాణాలను కాపాడటమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వైద్య బృందం డాక్టర్ గణేష్ సంకు, డాక్టర్ బి.ప్రతిభ, డాక్టర్ జి.నవీన్, డాక్టర్ పి.సంతోషి, మొత్తం సిబ్బందికి అభినందనలు తెలిపారు.



చికిత్స పొంది కోలుకున్న చిన్నారులతో డాక్టర్ తిరుపతిరావు

చెరువును తలపిస్తున్న ఆర్టీసీ బస్ కాంప్లెక్స్

- చిన్నపాటి వర్షానికే మోకాళ్లోతు నీరు
- జిల్లా కేంద్రంలో దీర్ఘకాలంగా ప్రయాణికులకు ఇక్కట్లు

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్

అనకాపల్లి జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్ కాంప్లెక్స్ ఆవరణ చిన్నపాటి వర్షానికే మోకాళ్లోతు ఎత్తులో నీరు నిల్వ ఉండిపోయి చెరువును తలపిస్తుంది. ఇక వర్షం ఎక్కువగా పడితే పరిస్థితి చెప్పనక్కర్లేదు. దీర్ఘకాలంగా కొనసాగుతున్న ఈ సమస్యకు అనకాపల్లి జిల్లా కేంద్రంగా మారిన పరిష్కారం లభించలేదు. జిల్లా కేంద్రంగా ఈ కాంప్లెక్స్ నుంచి సుమారు 96 బస్సులు ఐదు మార్గాల గుండా వివిధ ప్రాంతాలకు వెళ్తాయి. నిత్యం ప్రయాణికులతో కిటకిటలాడే ఈ స్టేషన్లో మురికి నీటిలోనే రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి. వర్షం పడితే ప్రయాణికులు నరకం చూడాల్సిన పరిస్థితి నెలకొంది. చుట్టుపక్కల ఉన్న కాలువలో ఉన్న మురికి నీరు కూడా కాంప్లెక్స్ ప్రాంగణంలోకి చేరిపోతుంది. దీంతో దుర్గంధంలోనే అతి కష్టం మీద బస్సుల కోసం నిరీక్షణ చేయాల్సిన పరిస్థితి నెలకొంటుంది. బస్సులొస్తే ఆ నీటిలోంచే అడుగులు వేసుకుంటూ బస్సు ఎక్కాలి. అనేక సంవత్సరాలు నుంచి వెంటాడుతున్న ఈ సమస్యకు మాత్రం చెక్ పడటం లేదు. ఇన్ గేట్ మొదలుకొని బస్సులు నిలిపే ప్రాంగణం మొత్తం నీటితో నిండిపోతుంది.

కాంప్లెక్స్‌లోంచి నీరు పోయే ఔట్ లెట్ మార్గం లేకపోవడమే దీనికి ప్రధాన కారణం. గతంలో కాంప్లెక్స్‌ను అనుకుని ఉన్న కాలువ ఆక్రమణలకు గురవడంతో నీరు పోయే మార్గమే లేదు. జిల్లా ఆర్టీసీ అధికారి ఉండే ఈ బస్టాండ్ లో ఈ సమస్యపై పలువురు పెదవి విరుస్తున్నారు. ప్రయాణికులకు అణువుగా తీర్చిదిద్దాల్సిన కాంప్లెక్స్‌ను ఎవరూ పట్టించుకోకపోవడం దారుణంగా పలువురు పేర్కొంటున్నారు. కాంప్లెక్స్‌ను ఆనుకునే అనేక వ్యాపార సముదాయాలు కూడా ఉన్నాయి. అయినా అధికారులు పట్టించుకోకపోవడంతో సమస్య అలానే కొనసాగుతుంది.



ఆర్టీసీ బస్ కాంప్లెక్స్‌లో నిలిచిపోయిన వర్షపు నీరు

వర్షం పడితే నీటిలోనే



కాంప్లెక్స్‌లో అనేక సమస్యలు ఉన్నాయి. ప్రధానంగా వర్షం పడితే ఇక నరకం చూడాల్సిందే. మోకాలు లోతులో నిలిచే నీటిలోనే మహిళలు, వృద్ధులు అందరూ నడవాల్సిన పరిస్థితి. ఎన్నో ఏళ్ల నుంచి ఈ సమస్య చూస్తున్నాం. జిల్లాగా మారాకైనా ఈ సమస్య తొలగలేదు. నీటిలో మురికి చేరిపోయి దుర్గంధమయంగా మారుతుంది. ఇప్పటికైనా ఈ సమస్యను పరిష్కరించాలి

- ఆకాష్, విద్యార్థి.



చేగువేరాకు నివాళులర్పిస్తున్న సిఐటియు నేతలు, కార్మికులు

చేగువేరాను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలి

ప్రజాశక్తి-పరవాడ

ప్రపంచ విప్లవకారుడు చేగువేరాను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గనిశెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. మండల కేంద్రం పరవాడ సంత బయలు వద్ద గురువారం సిఐటియు ఆధ్వర్యంలో చేగువేరా వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ముందుగా చేగువేరా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గనిశెట్టి మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లో స్వాతంత్ర్యం కోసం, వారి హక్కుల కోసం తుది శ్వాస విడిచే వరకు పోరాడిన కమ్యూనిస్టు యోధుడు చేగువేరా అని తెలిపారు. ఆయన ధైర్యసహసాలు ఆయన చేసిన పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకమని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఆర్ బాబూరావు, అప్పలరాజు, పద్మ, మంగ, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుండి బోధనేతర పనుల బహిష్కరణ

ప్రజాశక్తి-యలమంచిలి : ఫ్యాప్టో పిలుపు మేరకు ఉపాధ్యాయులంతా ఈ 10వ తేదీ నుండి బోధనేతర పనులు బహిష్కరిస్తున్నట్లు స్థానిక డిప్యూటీ డిఇఒ అప్పారావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ ఉపాధ్యాయులు కేవలం బోధనకు పరిమితమై మరింత నాణ్యత గల విద్యను అందించడమే లక్ష్యంగా ఫ్యాప్టో పిలుపు మేరకు విధులు నిర్వహిస్తామని చెప్పారు. ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన పనులు మాత్రం నిర్వహిస్తామన్నారు. గూగుల్ షీట్స్, విద్యాశక్తి, జిఎస్‌టి 2.0, వంటి సీజనల్ కార్యక్రమాలు చేపట్టబోమని తేల్చి చెప్పారు. మెమోరాండం సమర్పించిన వారిలో యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ ఎల్లయ్య బాబు, జిల్లా ఎస్టీఓ కమిటీ సభ్యులు మళ్లిపాటి సత్యనారాయణ, ఎపిటిఎఫ్ చంద్రశేఖర్, ఎస్టీవిఆర్ ఎం కిషోర్ ఉన్నారు.



డిప్యూటీ డిఇఒకు వినతిపత్రం ఇస్తున్న ఫ్యాప్టో నాయకులు

13న ఎండిఎం కార్మికుల ధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-చోడవరం : మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు బిల్లులు, వేతనాలు వెంటనే రిలీజ్ చేయాలని కోరుతూ ఈనెల 13వ తేదీన సోమవారం డిఇఒ ఆఫీస్ దగ్గర జరుగు ధర్నాకు మిడ్డేమీల్స్ కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సిఐటియు) రాష్ట్ర అధ్యక్షులు గూనూరు వరలక్ష్మి పిలుపునిచ్చారు. మిడ్డేమీల్స్ కార్మికులకు ఈ ఏడాది జూలై నెల నుండి నేటి వరకు బిల్లులు, వేతనాలు చెల్లించకపోవడంతో ఆర్థికంగా కార్మికులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు తెచ్చి మధ్యాహ్న భోజన పథకాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే బిల్లులు, వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇస్తున్న అరకొర వేతనాలు కూడా సకాలంలో ఇవ్వకపోతే ఎలా బతకాలని ఆమె ప్రశ్నించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా బడ్జెట్ని పెంచాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వమే గ్యాస్ సరఫరా చేయాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని కోరారు.

కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు

ప్రజాశక్తి-యలమంచిలి : ప్రైవేటు, కార్పొరేట్ల పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఎదుగుతున్నాయని స్టేట్ ఫుడ్ కమిషన్ సభ్యులు బి.కాంతారావు అభిప్రాయపడ్డారు. మున్సిపాలిటీ పరిధిలోని కొత్తపేట హైస్కూలను ఆయన గురువారం సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. తాను కూడా ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకున్నానని, ఉత్తమ ఉపాధ్యాయులంతా ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉన్నారని తెలిపారు. మంచి భోజనం తిన్నపుడే విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటారని, ఆరోగ్య బాగుంటేనే చదువు పట్ల ఆసక్తి పెరుగుతుందని చెప్పారు. మధ్యాహ్న భోజనం రుచికరంగా ఉంటుందా అని విద్యార్థుల్ని ప్రశ్నించారు. అంతకు ముందు స్థానిక ప్రభుత్వ బాలికల పాఠశాలను సందర్శించి అక్కడి భోజన కార్యక్రమాలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఇఒ అప్పారావు, ఎంఇఒ శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు వై.రమణ, ఫుడ్ కమిషన్ ఇతర సభ్యులు పాల్గొన్నారు.

సుగర్స్ క్రషింగ్‌పై స్పష్టమైన ప్రకటన చేయాలి

ప్రజాశక్తి- చోడవరం

చోడవరం (గోవాడ) సుగర్ ఫ్యాక్టరీ గానుగాటపై ఫ్యాక్టరీ యాజమాన్యం స్పష్టమైన ప్రకటన చేయాలని జనసేన నియోజకవర్గం ఇన్‌చార్జి పివిఎస్ఎన్.రాజు డిమాండ్ చేశారు. చెరకు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై చోడవరం సుగర్ ఫ్యాక్టరీ మేనేజింగ్ డైరెక్టర్‌తో బుధవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ ఆరు దశాబ్దాల ఫ్యాక్టరీ చరిత్రలో తొలిసారిగా ఈ సంవత్సరం చెరకు క్రషింగ్‌కి సంబంధించిన కార్యకలాపాలు ప్రారంభం కాలేదన్నారు. ఈ పరిస్థితికి కారణాలు ఇప్పటివరకు సభ్య రైతులకు తెలియజేయలేదన్నారు. గత క్రషింగ్ సీజన్‌కి సంబంధించిన కోట్ల రూపాయల బకాయిలు రైతులకు ఇంకా చెల్లించాల్సి ఉందని పేర్కొన్నారు. దీనిపై ఎండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పెండింగ్ పేమెంట్లు గూర్చి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని తెలిపారు. ఈ సీజన్‌లో చెరకు క్రషింగ్‌పై కేన్ కమిషనర్ త్వరలోనే నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో చోడవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లం మాధవి రామ అప్పారావు, జుత్తాడ గ్రామ సర్పంచ్ దొడ్డి ప్రసాద్, సీనియర్ నాయకులు మంగా శ్రీను, ఆడారి నాయుడు, పీలా మహేష్, చప్పగడ్డ శ్రీను, బుద్ధిగ భగవాన్, జగదీష్, ఉదయ్, గోపి పాల్గొన్నారు.

కాన్షీరాంకు ఘన నివాళి

ప్రజాశక్తి-అనకాపల్లి

బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపకులు కాన్షీరామ్ వర్ధంతి సందర్భంగా గురువారం ఆ పార్టీ నాయకులు స్థానిక రామచంద్ర థియేటర్ జంక్షన్‌లో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద కాన్షీరాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా ఇన్చార్జ్ సూదికొండ మాణిక్యాలరావు మాట్లాడుతూ అట్టడుగు బలహీన వర్గాల ప్రజల సమస్యలకు రాజ్యాధికారమే ఏకైక పరిష్కారమని కాన్షీరాం భావించి దేశవ్యాప్తంగా సైకిల్ యాత్ర ద్వారా బహుజన వర్గాల ప్రజల్లో చైతన్యం కలిగించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో పార్టీ ప్రతినిధులు కొల్లిచిన అప్పారావు, వుడింగల నాగేంద్ర కుమార్, కాపారపు సత్యనారాయణ పాల్గొన్నారు.

వైద్య రంగంలో జిఎస్‌టి ప్రయోజనాలపై అవగాహన



మాట్లాడుతున్న అనకాపల్లి డిఎంహెచ్ఒ హైమావతి

ప్రజాశక్తి-అనకాపల్లి : జిఎస్‌టి తగ్గింపు వల్ల వైద్య రంగంలో ప్రయోజనాలపై స్థానిక ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రిలో గురువారం అవగాహన కార్యక్రమం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి హైమావతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీఎస్టీ 2.0 సంస్కరణలతో వైద్య పరికరాలు, మందులపై 12 నుంచి ఐదు శాతానికి తగ్గించడం వల్ల పేదలపై మందుల భారం తగ్గిందన్నారు. జీవిత ఆరోగ్య పాలసీలపై కూడా పూర్తి మినహాయింపు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డిసిహెచ్ఎస్ డాక్టర్ శ్రీనివాస్, ఆసుపత్రి సూపరింటెండెంట్ కృష్ణారావు, డిఎల్ఎటిఒ డాక్టర్ స్వప్న, డిఐఒ డాక్టర్ చంద్రశేఖర్ దేవ్, డీపీఎంఒ ప్రశాంతి, డిఎంఒ వరహాల దొర, అసిస్టెంట్ కమిషనర్ ఎం ప్రేమ్ కుమార్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్లు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : జిఎస్‌టి 2.0తో మందుల ధరలు తగ్గాయని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. గురువారం జివిఎంసి జోన్ – 4 కార్యాలయ భవనం సమావేశ మందిరంలో జిఎస్‌టి 2.0పై ప్రైవేటు ఆసుపత్రులు, ఇన్సూరెన్స్ యాజమాన్యాల వారితో సమావేశం నిర్వహించారు. దీనిలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ వినోద్ కుమార్, జిల్లా నోడల్ అధికారి డాక్టర్ ఆర్.రమేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విశాఖ డిఎంహెచ్ఒ జగదీశ్వరరావు

జిఎస్‌టి ప్రయోజనాలపై ప్రచారం చేయాలి

చోడవరం : జీఎస్టీ తగ్గింపు ద్వారా ప్రజలకు జరిగే ప్రయోజనాన్ని ప్రచారం చేయాలని చోడవరం పంచాయతీ ఇఒ శ్రీనివాసరావు అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద జీఎస్టీ అవగాహన సదస్సును గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చోడవరం పట్టణంలో విస్తృతంగా ప్రచారం చేపట్టామన్నారు. వినియోగదారులకు తెలిసేలా ఐకెపి, వెలుగు, అంగన్వాడి, ఆశ, పంచాయతీ కార్మికులు ప్రచారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బండి నూకాలమ్మ, పంచాయతీ సిబ్బంది ప్రతాప్ కుమార్ సాహూ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చోడవరం పంచాయతీ ఇఒ శ్రీనివాసరావు

ఎపిటిఎఫ్ పుస్తకం ఆవిష్కరణ

ప్రజాశక్తి-సబ్బవరం

ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా శాఖ నూతన ఉపాధ్యాయుల కోసం ముద్రించిన పుస్తకాలను అనకాపల్లి జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావు నాయుడు చేతులు మీదుగా గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎపిటిఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి బి.వెంకటపతిరాజు మాట్లాడుతూ ఈ పుస్తకాల్లో నూతనంగా ఉపాధ్యాయ వృత్తిలో చేరబోతున్నవారికి సర్వీస్ ఓరియెంటెడ్ మేటర్స్‌తో కూడిన సమాచారం అందజేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ధర్మారావు, దుర్గాప్రసాద్, రెడ్డి ప్రసాదరావు, హేమంత్ సుదేవ్, మహాలక్ష్మి నాయుడు, బండారు ముత్యాలు నాయుడు, తారక్ సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.


పశు వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న టిడిపి నేత సూర్యనారాయణ

ఉచిత పశువైద్య శిబిరం

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని గరిసింగి గ్రామంలో గురువారం రాష్ట్రీయ గోకుల్ మిషన్, డీఎల్డీఏ (విశాఖపట్నం) సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని టిడిపి సీనియర్ నాయకుడు శరకాన సూర్యనారాయణ ప్రారంభించారు. సుమారు 30 పశువులకు గర్భకోశ చికిత్స, 20 పశువులకు చుడి పరీక్ష, 35 పశువులకు ఇతర వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో దేవరాపల్లి పశువైద్యాధికారిణి డాక్టర్ జి.గాయత్రి దేవి, గొంతిన నరసింహనాయుడు, అల్లం విశ్వనాథం, వివి సురేష్, ఏహెచ్‌ఏ శ్రీను, దేముడునాయుడు, దివ్య, అప్పారావు, గోపాల మిత్ర యెర్రిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ దృష్టి దినోత్సవం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని దిబ్బిడి జిల్లా పరిషత్తు హైస్కూల్‌లో ప్రపంచ దృష్టి దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా నేత్ర సంరక్షణపై విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. మొత్తం 45 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనగా జూనియర్ విభాగంలో ఎస్.దివ్య, ఎస్.పుష్ప, ఎస్.స్వాతి, సీనియర్ విభాగంలో సియ్యాద్రి లత, జి.హేమంత్, అనుష్క ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. వారికి సర్టిఫికెట్లు, బహుమతులు శుక్రవారం అసెంబ్లీలో అందజేస్తామని ప్రత్యేక ఉపాధ్యాయులు అప్పలరాజు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కె.సత్యారావు, సీనియర్ ఉపాధ్యాయులు మూర్తి తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లి : ప్రతి సంవత్సరం అక్టోబర్ రెండవ గురువారం నిర్వహించే ప్రపంచ దృష్టి దినోత్సవాన్ని గురువారం దేవరాపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సి వైద్యుడు కె.ప్రశాంత్ మాట్లాడుతూ చూపు లేకుంటే జీవితం చీకటిలో మునిగిపోతుందని, కంటి ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆప్తమాలిక్ అధికారిణి కె. భవాని, పీహెచ్‌ఎన్ అప్పలనరస, హెల్త్ సూపర్వైజర్ పుష్పరాజు, ఏఎన్‌ఎం భీమాలమ్మ తదితరులు పాల్గొన్నారు.


వ్యాస రచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

జోరువానలోనూ జగన్ పర్యటన



తాళ్లపాలెంలో జగన్ రాక కోసం ఎదురు చూస్తున్న వైసిపి శ్రేణులు, వర్షంలో తడుస్తూ అభివాదం చేస్తున్న వైఎస్.జగన్

ప్రజాశక్తి-కశింకోట : జోరున వర్షం కురుస్తున్నా మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పర్యటన కొనసాగింది. మధ్యాహ్నం 3 గంటలకు జగన్ కాన్వాయ్ కశింకోట మండలంలోని కశింకోట,తాళ్లపాలెం, కన్నూరుపాలెం మీదు వెళ్లింది. ఆ సమయంలో వర్షం కురుస్తున్నా జగన్ వర్షంలో తడుచుకుంటూ ప్రజలకు అభివాదం చేసుకుంటూ వెళ్లారు. జగన్ రాకకోసం తాళ్లపాలెం జంక్షన్‌లో యువకులు మధ్యాహ్నం 12 గంటల నుండిఎదురు చూశారు. జగన్ పర్యటన నేపథ్యంలో పోలీసులు అడుగడుగునా వాహనాల తనిఖీలు చేశారు. ముఖ్య కూడళ్లలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. జగన్‌కు స్వాగతం పలికిన వారిలో ఎంపీపీ కలగ లక్ష్మి, వైస్ ఎంపిపి పెంటకోట జ్యోతి, వైసిపి నాయకులు తగరమపూడి నూకరత్నం, నీటిపల్లి లక్ష్మి, ఎంపిటిసి లగిశెట్టి భవాని ఉన్నారు.

నూకరత్నంకు స్వల్ప గాయాలు

తాళ్లపాలెం జంక్షన్ నుండి జగన్ కాన్వాయ్ వెళ్తుండగా కసింకోట గ్రామానికి చెందిన వైసిపి మండల మహిళా అధ్యక్షులు తగరంపూడి నూకరత్నం, ఇతర మహిళా కార్యకర్తలతో కలిసి రోడ్డు పక్కన నిల్చుని జగన్‌ను స్వాగతం పలికేందుకు నిల్చుండగా, వెనుకనున్న ఎవరో ఒక వ్యక్తి కాలుజారి ఆమె మీద పడిపోగా, ఆమె కిందపడిపోయారు. వెంటనే స్థానికులు, పోలీస్ సిబ్బంది స్పందించి, ఆమెను సమీప పిహెచ్‌సికి తరలించి చికిత్స అందించారు. ఆమెకు తీవ్రమైన గాయాలు ఏమీకాలేదని వైద్యులు తెలిపారు.

జగన్‌కు ఘన స్వాగతం

పెందుర్తి : వేపగుంట, పురుషోత్తపురం, పెందుర్తి మెయిన్‌రోడ్డులో జగన్మోహన్‌రెడ్డి రోడ్ షో నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలకు, ప్రజలకు అభివాదం చేస్తూ సాగారు. కొంతమంది తమ సమస్యలను జగన్మోహన్‌రెడ్డికి చెప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అదీప్ రాజు, నాయకులు శరగం చిన అప్పలనాయుడు, దేవి సాంబ, తామర్ల నర్సింగరావు పాల్గొన్నారు.

పద్మనాభం : నర్సీపట్నం సమీపం మాకవరపాలెంలోని మెడికల్ కాలేజీ వద్దకు వచ్చిన జగన్మోహన్‌రెడ్డిని కలుసుకునేందుకు పద్మనాభం మండల వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు చలో నర్సీపట్నం వెళ్లారు. వైసిపి మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, ఎంపిపి కె.రాంబాబు, జిల్లా పరిషత్తు వైస్ చైర్మన్ ఎస్.గిరిబాబు, తదితరులు తరలి వెళ్లారు.

అనకాపల్లి : జగన్ పర్యటన సందర్భంగా స్థానిక కొత్తూరు జంక్షన్‌కు వివిధ ప్రాంతాల నుంచి పార్టీ శ్రేణులు, ప్రజలు తరలివచ్చి జగన్‌కు స్వాగతం పలికారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్, పట్టణ అధ్యక్షులు మందపాటి జానకి రామరాజు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

జగన్ రోడ్డు షోకి తరలి వెళ్లిన వైసిపి శ్రేణులు

సబ్బవరం : జగన్ రోడ్డు షోకు జివిఎంసి 88వ వార్డు వెదుళ్ల నరవ ప్రాంతం నుండి వైసిపి శ్రేణులు భారీగా తరలివెళ్లారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు శ్రీనివాస పట్నాయక్, ఎస్.బొర్రయ్య, పి. శ్రీను, సిహెచ్ తాతారావు, సిహెచ్ కనకరాజు, పల్లా చిన్న, డి.నాగరాజు, ఎన్.అప్పలరాజు, ఎస్.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

భోజనాలు అందక ఇబ్బందుల పడ్డ కార్యకర్తలు

కోటవురట్ల : జగన్మోహన్ రెడ్డి మాకవరపాలెం మండలంలోని మెడికల్ కళాశాల సందర్శన సందర్భంగా వచ్చిన కార్యకర్తలకు భోజనాలు లేక ఇబ్బందులు పడ్డారు. కనీసం తాగేందుకు నీళ్ల కూడా ఏర్పాటు చేయకపోవడంతో అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. మధ్యాహ్నం వరకు తీవ్రమైన ఎండతో అల్లాడిన కార్యకర్తలకు కనీసం తాగునీరు కూడా అందించకపోతే ఎలా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు గంటల తరవాత అరకొరగా వచ్చిన భోజనాల వద్ద కార్యకర్తలు బారులు తీరారు.


భోజనాల కోసం ఎగబడుతున్న దృశ్యం

వైసిపి గ్రామ కమిటీల ఏర్పాటు

ప్రజాశక్తి-కశింకోట : మండలంలో జమాదులపాలెం గ్రామ వైసిపి అధ్యక్షుడుగా కరక ఆకాష్, యువజన విభాగం అధ్యక్షుడుగా బొట్టా నాగఅప్పారావును నియమిస్తూ వైసిపి అనకాపల్లి నియోజకవర్గం ఇన్‌చార్జ్ మలశాల భరత్ కుమార్ ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా వారు గురువారం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ గ్రామంలో వైసిపి బలోపేతం కోసం కృషి చేస్తామని చెప్పారు.


కరక ఆకాష్, బొట్టా నాగప్పారావు


ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న డాక్టర్లు, వైద్య సిబ్బంది

అక్రమ కట్టడాల పరిశీలన

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి దేముని గుమ్మం శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయం, అర్చకులకు చెందిన సర్వేనెంబర్ 224లో స్థలంలో అక్రమంగా నిర్మించిన కట్టడాలపై దేవాలయం పాలకవర్గం, ఈవో, సంబంధిత అర్చకులు, భక్తులు ప్రజలు నిర్మాణాలను అడ్డుకున్న విషయంపై పలు దినపత్రికల్లో వచ్చిన వార్తల నేపథ్యంలో గురువారం దేవాదాయ ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కెవెల్ సుధారాణి స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ భూమి దేవాలయం అర్చకులకు చెందిన ఇనాం భూమి అని, దీనిపై దేవాదాయ ధర్మాదాయ శాఖ ట్రిబ్యునల్ కోర్టులో ఓఏ దావా ఉండగా సదరు వ్యక్తి ద్వారా కొంతమంది, దురాక్రమంగా స్థలంలో ప్రవేశించి నిర్మాణాలు చేపట్టడం నేరమని పేర్కొన్నారు. అక్రమార్గంగా చేపట్టిన నిర్మాణాలను తొలగించుటకు ఆదేశాలు జారీ చేస్తున్నామని తెలిపారు. ఈ స్థలంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ బోర్డు తక్షణమే ఏర్పాటు చేయాలని సూచించారు. ఎన్ని చేతులు మారినా దేవాలయాల భూములు దేవాలయాలకు చెందే విధంగా తమ శాఖ అధికారులు, ప్రభుత్వం ముందుంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ బొలిశెట్టి శ్రీనివాసరావు, కార్య నిర్వహణ అధికారి బి మురళీకృష్ణ, అర్చకులు కృష్ణమాచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి -మునగపాక

స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద ఏసియన్ పెయింట్స్ ఆధ్వర్యాన ఉచిత సంచార వైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. వైద్యులు వివిధ వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ దిమ్మల అప్పారావు మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు విజయకుమార్, పద్మావతి, సుధీర్, సంచార వైద్యశాల ఆర్గనైజర్ అచ్చయ్య నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

శిథిలావస్థలో ఇరిగేషన్ సెక్షన్ కార్యాలయం

- భవన నిర్మాణానికి 2020లో నిధులు మంజూరు
- స్థలం కేటాయింపు లేకపోవడంతో జరగని నిర్మాణం
- మురుగుపోయిన నిధులు

ప్రజాశక్తి-సబ్బవరం

మండల కేంద్రంలోని ఇరిగేషన్ సెక్షన్ కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది. కొత్త భవనం నిర్మాణానికి నిధులు మంజూరైనా నిర్మాణానికి నోచుకోలేదు. అధికారుల నిర్లక్ష్య వైఖరి కారణంగానే ఈ పరిస్థితి నెలకొంది.

ఇరిగేషన్ సెక్షన్ కార్యాలయం ఎంపీడీవో క్వార్టర్స్‌లో నడుస్తుంది. ఈ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. ఇరిగేషన్ సెక్షన్ కార్యాలయం నిర్మాణానికి 2020 జూన్ 26న నాటి ప్రభుత్వం రూ.9 లక్షలు నిధులు మంజూరు చేసింది. మూడు నెలల్లో టెండర్ కూడా ఖరారు అయి కాంట్రాక్టర్ ముందుకు వచ్చారు. అయితే కొత్త భవనానికి స్థల సమస్య ఏర్పడింది. ప్రస్తుతం కార్యాలయం నడుస్తున్న భవనాన్ని కూల్చివేసి కొత్త భవనం నిర్మాణానికి గతంలో ఎంపీడీవోలు అంగీకరించలేదు. మండల పరిషత్ ప్రాంగణంలో పలు శాఖల కార్యాలయాలు ఉండటంతో స్థలం కేటాయించాలని ఇరిగేషన్ శాఖ డీఈఈ తహసీల్దార్‌కు, ఎంపీడీవోకు పలుమార్లు లేఖలు రాశారు. అయినప్పటికీ వారు స్పందించకపోవడంతో టెండర్ కాలపరిమితి ముగియడంతో కాంట్రాక్టర్ తప్పుకునే పరిస్థితి వచ్చింది. మంజూరైన నిధులు మురిగిపోయాయి.

ఎఇ వివరణ

ఈ విషయమై స్థానిక ఇరిగేషన్ ఎఈ జి.కార్తీక్‌ను వివరణ కోరగా ప్రస్తుతం ఇరిగేషన్ శాఖ సెక్షన్ కార్యాలయం శిథిలావ్యవస్థలో ఉందని, వర్షం పడితే నీటి చెమ్మతో గోడలు బీటలు వారాయని తెలిపారు. తలుపులు, కిటికీలు, గుమ్మాలు పాడవడం వల్ల సిబ్బంది విధులకు ఆటంకం కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ఆర్డీవో దృష్టికి కూడా డీఈఈ లేఖ పంపించినట్లు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇరిగేషన్ సెక్షన్ కార్యాలయానికి స్థలం చూపించి ఆ కార్యాలయ నిర్మాణానికి కంకణం కొట్టుకోవాలని ఆయన కోరారు.


శిథిలావస్థలో ఉన్న సెక్షన్ కార్యాలయం ఇదే..

టిడిపి సీనియర్ కార్యకర్త మృతి

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని బోయిలకింతాడ గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ కార్యకర్త తుంపాల అప్పలనాయుడు (68) గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. పార్టీ ఆవిర్భావ కాలం నుంచి టిడిపిలో ఉన్న అప్పలనాయుడు మండలంలో సీనియర్ కార్యకర్తగా గుర్తింపు తెచ్చుకున్నారు. రైవాడ జలాశయం కలిగొట్ల కెనాల్ డైరెక్టర్‌గా కూడా సేవలందించారు. అప్పలనాయుడు మృతదేహాన్ని టిడిపి మండల మాజీ అధ్యక్షులు చిటిమిరెడ్డి సూర్యనారాయణ సందర్శించి పూలమాల వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కొమర బాబురావు, గోరపల్లి త్రిమూర్తులు, అడపా ఈశ్వరరావు, తుంపాల ప్రసాద్, దాసరి వెంకునాయుడు, కడియం నాగేశ్వరరావు, బండారు శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

బల్క్ డ్రగ్ పార్కుతో పొట్టకొట్టొద్దు

ప్రజాశక్తి -నక్కపల్లి: బల్క్ డ్రగ్ పరిశ్రమ ఏర్పాటు చేసి తమ పొట్ట కొట్టొద్దని మత్స్యకారులు అన్నారు. మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో బల్క్ డ్రగ్ ను వ్యతిరేకిస్తూ మత్స్యకారులు తలపెట్టిన శాంతియుత రిలే దీక్షలు గురువారం నాటికి 26 వ రోజుకు చేరింది. బల్క్ డ్రగ్‌ను వ్యతిరేకిస్తూ మత్స్యకారులు పెద్ద పెట్టున నినాదాలు చేశారు. బల్క్ డ్రగ్ ఏర్పాటు చేసి తమ జీవితాలను నాశనం చేయెుద్దన్నారు. సముద్రాన్ని నమ్ముకుని జీవనం సాగిస్తున్నామని, చేపలు వేట తప్ప మరే వృత్తి తమకు తెలియదని, సముద్రాన్ని కలుషితం చేసి తమ బతుకులు బుగ్గిపాలు చేయెుద్దన్నారు. ఇప్పటికే వ్యర్థ రసాయన జలాలతో సముద్రం కలుషితమై చేపలు నశించి పోవడంతో తామంతో ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డామని ఆవేదన వ్యక్తం చేశారు. బల్క్ డ్రగ్ ఏర్పాటు చేస్తే తమ ఉనికికే ప్రమాదం వాటిల్లుతుందన్నారు. బల్క్ డ్రగ్ నిలుపుదల చేసే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మత్స్యకారులు, మత్స్యకార మహిళలు పాల్గొన్నారు.


ఆందోళన చేస్తున్న మత్స్యకారులు

సాగులోవున్న రైతులకు న్యాయం చేస్తాం

-వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అప్పలరాజు


మాట్లాడుతున్న అప్పలరాజు

ప్రజాశక్తి -మాడుగుల: మాడుగుల మండలంతో పాటు రావికమతం మండలం పరిధిలో ఉన్న కొండ భూములను సాగు చేస్తున్న రైతులు ఆందోళన చెందవద్దని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు పేర్కొన్నారు. గురువారం స్థానిక పంచాయతీరాజ్ అతిథిగృహం ప్రాంగణంలో విలేకరులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఉరలోవ, నాగళ్లకొండ, కొప్పుకొండల పరిధిలో డిపారం భూములను సాగు చేస్తున్న 469 మంది రైతులు ఉన్నారని, 654.47 ఎకరాలు భూమిని సాగు చేస్తున్నారని, వారిని గుర్తించామని చెప్పారు. వారిలో కొంతమందికి 2010, 11,12 సంవత్సరాలలో ఐదవ విడతలో పట్టాలు కూడా అందించడం జరిగిందని పేర్కొన్నారు. మిగిలిన రైతులకు కూడా ఈ కూటమి ప్రభుత్వంలో న్యాయం చేసే దిశగా చర్యలు తీసుకున్నామని ఈ విషయాన్ని శాసనసభ్యులు బండారు సత్యనారాయణమూర్తి ద్వారా కలెక్టర్కు కూడా తెలియపరచడం జరిగిందని చెప్పారు. త్వరలో ఈ మూడుకొండల ప్రాంతాలలో సాగులో ఉన్న రైతులకు న్యాయం చేసే దశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. సాగులో ఉన్న రైతుల భూములను వెబ్ ల్యాండ్‌లో ఎక్కించి ఆన్లైన్ చేసి పట్టాదారు పాస్ పుస్తకాలను అందించే బాధ్యత తీసుకుంటామని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. దీనిపై ఎవరూ కూడా భయపడాల్సిన అవసరం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్ష, కార్యదర్శులు నందారపు సన్యాసిరావు, పుప్పాల రమేష్, పెద్దేరు జలాశై చైర్మన్ అద్దేపల్లి జగ్గారావు, కింతలి పిఎసిఎస్ అధ్యక్షులు ఉండూరు దేవుడు, సర్పంచులు సుంకరి సింహాచలం నాయుడు, చామంతుల నాగమణి జయరాం, వడ్డాది చారుమతి దేవి, కూటమి నాయకులు పాల్గొన్నారు.


ఎన్నికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

పాఠశాలలో ఎస్‌పిఎల్ ఎన్నికలు

ప్రజాశక్తి-కొత్తకోట: రావికమతం మండలం కొత్తకోట పిఎస్ఆర్ఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థుల స్టూడెంట్ పీపుల్స్ లీడర్ (ఎస్పిఎల్)ఎన్నికలు ఉత్సాహ భరిత మైన వాతావరణంలో జరిగాయి. పాఠశాలలో సుమారు 374 మంది ఓటు హక్కు వినియోగించుకన్నారు. ఉదయం 10 నుంచి జరగగా మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్లు కౌటింగ్ ప్రారంభించారు. ఎనిమిది రౌండ్లుగా నిర్వహించిన కౌటింగ్ లో ద్వారపురెడ్డి దేవహర్ష 133 (పెన్ను గుర్తు) ఓట్ల సాధించి తొలి స్థానంలో గెలవగా రెండవ స్థానంలో గాలి అఖిలాండేశ్వరి 123 (పుస్తకం) ఓట్లు సాధించింది. అడ్డూరి చరణ్ తేజ 111 ఓట్లు సాధించి మూడవ స్థానంలో నిలిచాడు. ఈ ఎన్నికలలో ఐదుగురు విద్యార్థులు పోటీ పడ్డారు. పాఠశాల హెచ్ఎం జేజే రాజ్ కుమార్ బాలురు విద్యార్థుల లీడర్ గా దేవ హర్షను, బాలికల తరుపున గాలి అఖిలాండేశ్వరిని లీడర్‌గా ప్రకటించారు. ఎన్నికల అధికారి వెంకు నాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జ్ జిపిఎస్ నాయుడు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఇకెవైసి తప్పనిసరి

ప్రజాశక్తి-గొలుగొండ: ఉపాధి హామీ కూలీలకు ఈకేవైసీ తప్పనిసరి అని గొలుగొండ ఇన్‌ఛార్జ్ ఎంపిడిఓ ఉలబాల శ్రీనివాసరావు అన్నారు. గురువారం గొలుగొండ మండలం ఎర్రవరం గ్రామంలో ఉపాధి కూలీలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ, వచ్చే నెల 1 నుంచి ఫేస్ ఆధారిత నమోదు ద్వారా దినసరి కూలీ హాజరు వేయడం జరుగుతుందన్నారు. ఈ ప్రక్రియతో దొంగ మస్టర్లను అరికట్టే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపిఓ సూర్యమణి, పంచాయతీ కార్యదర్శులు శివ, అప్పారావు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెట్టాలి

ప్రజాశక్తి -నక్కపల్లి: ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి పెట్టాలని ఎంపీడీవో డి సీతారామరాజు, డిప్యూటీ ఎంపీడీవో చలపతిరావు అన్నారు. మండలంలో వేంపాడులో ప్రకృతి వ్యవసాయ వనరుల శిక్షణా కేంద్రాన్ని సందర్శించారు. వర్మీ కంపోస్ట్, ప్రకృతి విధానములో సహజ సిద్ధమైన ఎరువులను పరిశీలించారు. ప్రకృతి విధానంలో సాగు చేయడంతో తక్కువ పెట్టుబడితో ఆరోగ్యకరమైన దిగుబడులు సాధించవచ్చునని అన్నారు. అనంతరం గ్రామంలో శానిటేషన్ పనులను పర్యవేక్షించారు. కాగిత గ్రామంలో జీఎస్టీ తగ్గింపు పై ఉపాధి హామీ శ్రామికులకు అవగాహన కల్పించారు. విలేజ్ హెల్త్ క్లినిక్ సెంటర్‌ను సందర్శించి వైద్య సిబ్బందితో కలిసి, రోగులకు జీఎస్టీ తగ్గింపు పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎం.శ్రీను పాల్గొన్నారు.


శిక్షణా కేంద్రాన్ని సందర్శించిన ఎంపిడిఓ


అవగాహన కల్పిస్తున్న ఎంఇఓ

హెచ్ఐవిపై అవగాహన

ప్రజాశక్తి - చీడికాడ: రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాలతో జిల్లా ఎయిడ్స్ నిర్మూలన సంస్థ ఎస్వీడీఎస్‌సిసి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల విద్యాశాఖ అధికారి బొంజుబాబు ఆధ్వర్యాన విద్యార్థులకు హెచ్ఐవి పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ మేనేజర్ మహాలక్ష్మి నాయుడు మాట్లాడుతూ, హెచ్ఐవి సోకితే జరిగే పరిణామాలను వివరించారు. హెచ్ఐవి వైరస్ ఉన్న రక్తమార్పిడి, ఇంజక్షన్, సిరంజీలు, రక్షణ లేని లైంగిక కార్యకలాపలతో సోకుతుందని తెలిపారు ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి ఆరోగ్యం పట్ల అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం వరాహపురం, మంచాల, కోనాం, సిరిజాం, గదబోరు గ్రామాలలో కూడా హెచ్ఐవి పై అవగాహన కల్పించారు.

ప్రోటీన్ ఫుడ్ పంపిణీ

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: నర్సీపట్నం సత్యసాయి సేవా సమితి, శారద నగర్ ఆధ్వర్యంలో గురువారం ఉదయం స్థానిక ప్రాంతీయ ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణీలకు ప్రోటీన్ ఫుడ్ అందజేశారు. ఈ సేవా కార్యక్రమానికి శారద నగర్ వాసులు పైల వెంకట రమణరావు ఆయన సతీమణి పైల లోవలక్ష్మి ప్రోటీన్ ఫుడ్ అందించారు. ఈ కార్యక్రమంలో సుమారు 80 మంది గర్భిణీలకు ప్రోటీన్ ఫుడ్ పంపిణీ చేశారు. సత్యసాయి సేవా సమితి కన్వీనర్ రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి భక్తులు పాల్గొన్నారు.



పంపిణీ చేస్తున్న లోవలక్ష్మి

వ్యవసాయ శాఖపై ఎమ్మెల్యే సమీక్ష

ప్రజాశక్తి -మాడుగుల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం విజన్ 2047 పై నాలుగు మండలాల అగ్రికల్చర్, నేచురల్ ఫార్మింగ్ అధికారులతో రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాసన సభ్యులు బండారు సత్యనారాయణమూర్తి అధికారులకు పలు సలహాలు సూచనలు అందించారు. వ్యవసాయ శాఖపై సమీక్ష చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జెడి మోహన్రావు నాలుగు మండలాల వ్యవసాయ అధికారులు,పి ఫోర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


సమీక్ష చేస్తున్న బండారు

సంక్షేమ ఫలాలు అందించేందుకు కృషి

-రాష్ట్ర కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ ఈశ్వరరావు


మాట్లాడుతున్న ఈశ్వరరావు

ప్రజాశక్తి-కొత్తకోట: కుమ్మరి శాలివాహన వృత్తి దారులకు పలు సంక్షేమ ఫలాలు అందించేందుకు కృషి చేస్తానని రాష్ట్ర కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ పెరిపి ఈశ్వరరావు అన్నారు. రావికమతం మండలం కొత్తకోటలో అనకాపల్లి జిల్లా కుమ్మరి శాలివాహన సంఘం సభ్యుల సమావేశం గురువారం స్థానిక రవి పంక్షన్ హాల్ లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ, బిసి కులాలలో అత్యంత వెనుకబడిన కుమ్మరి శాలివాహన సామాజిక వర్గానికి కుల వృత్తి ఆధారమన్నారు. కుల వృత్తి మనుగడకు, ఇటుకుల బట్టీల ద్వారా ఇటుకు తయారీకి ప్రభుత్వం ఉచితంగా మట్టి సరఫరా చేయాలని కోరుతూ జీవో విడుదలకు ముమ్మర ప్రయత్నం చేస్తున్నట్టు ఈశ్వరరావు పేర్కొన్నారు. వృత్తి దారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, మట్టి పాత్రలు తయారీ లో కాలుష్య నివారణకు గ్రామ శివారులో స్థలం కేటాంచాలని, ముఖ్య మంత్రి చంద్రబాబు ను కోరుతున్నట్టు తెలిపారు.సాధనకు త్వరలో విజయవాడ లో భారీ బహిరంగ సభను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ మాజీ చైర్మన్ తుగ్గల నాగేంద్ర, మండెం పూడి పురుషోత్తం తదితరులు మాట్లాడుతూ కుమ్మరి కులాలను ప్రభుత్వాలు రాజకీయ, సామాజిక అంశాలలో గుర్తించడం లేదన్నారు. ఈ కార్యక్రమలో కుమ్మరి శాలివాహన సంఘం జిల్లా అధ్యక్షులు పొన్నాడ అప్పలకొండ, రాష్ట్ర శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ దాలిపర్తి వేమన, విజయకుమారి, పి.అప్పారావు జిల్లా మహిళా అధ్యక్షులు లక్ష్మి, మండల సంఘం అధ్యక్షులు మల్లి చిరంజీవి, నక్క చినబ్బాయి పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న మత్స్యకార మహిళలు

గ్రామ దేవతకు మత్స్యకారుల జలాభిషేకం

ప్రజాశక్తి -నక్కపల్లి: గ్రామానికి ఆనుకుని బల్క్ డ్రగ్ అనే విషతుల్య పరిశ్రమను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని, తమ ఉనికికే ప్రమాదం వాటిల్లే పరిస్థితి నెలకొందని . రక్షించు తల్లీ అని మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో మత్స్యకార మహిళలు గ్రామ దేవత భాగిత్తమ్మ కు గురువారం జలాభిషేకం చేశారు. బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ మత్స్యకారులు తలపెట్టిన శాంతియుత రిలే దీక్షలు గురువారం నాటికి 26 రోజులకు చేరింది. సమస్య పరిష్కారం కాకపోవడంతో గ్రామానికి చెందిన మత్స్యకార మహిళలు బిందువులతో నీళ్లు తీసుకుని వెళ్లి గ్రామ దేవత భాగిత్తమ్మ కు జలాభిషేకం చేసి, కంపెనీ రాకుండా అడ్డుకొని, గ్రామాన్ని కాపాడాలని వేడుకున్నారు.



ప్రారంభిస్తున్న హెచ్ఎం విజయ

ఉత్సాహంగా హాకీ సెలక్షన్స్

ప్రజాశక్తి -నక్కపల్లి: నక్కపల్లిలో హాకీ క్రీడా మైదానంలో ఉమ్మడి విశాఖ జిల్లా ఎస్.జి.ఎఫ్ ఆధ్వర్యంలో అండర్ -17 బాల బాలికల హాకీ జట్టు సెలక్షన్స్ గురువారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం కె.విజయ ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమానికి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి ప్రతిభ గల హాకీ జట్టుని ఎంపిక చేసి రాష్ట్ర స్థాయికి పంపించాలని సెలక్టర్లకు సూచించారు. క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు.బలిరెడ్డి సత్యవతి హాకీ క్లబ్ ఫౌండర్ బలిరెడ్డి సూరిబాబు క్రీడాకారులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. క్రీడాకారుల ఎంపిక సంబంధించి పరిశీలకులుగా అనకాపల్లి జిల్లా ఎస్‌జిఎఫ్ సెక్రటరీ నాయుడు, ఎస్వీ నరసింహం, ఎమ్.నాగేశ్వరరావు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో బిఎస్ హాకీ క్లబ్ కార్యదర్శి కొల్నాటి తాతాజీ, ఉమ్మడి విశాఖ జిల్లా వ్యాయామ ఉపాధ్యాయులు రాజు, కిరణ్ కుమార్, అన్నాజీ, ఇందిరా రాణి, శిరీష పాల్గొన్నారు.



మానవహారం నిర్వహిస్తున్న దళిత సంఘాల నేతలు

దళిత సంఘాల నిరసన

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నర్సీపట్నం పర్యటనను వ్యతిరేకిస్తూ దళిత సంఘాలు నిరసన చేపట్టాయి. స్థానిక అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి అబీద్ సెంటర్లో మానవహారంగా ఏర్పడ్డారు. జగన్ గో బ్యాక్ గో బ్యాక్ జగన్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా దళిత నాయకుడు మరిడయ్య మాట్లాడుతూ, మాకవరపాలెం మండలంలో నిర్మించతలపెట్టిన మెడికల్ కాలేజీ తుప్పలతో నిండిపోయిందని ఆరోపించారు. దళిత డాక్టర్ సుధాకర్‌ను హింసించిన మీరు నర్సీపట్నంలో ఎలా అడుగు పెడతారని ప్రశ్నించారు.

పిచ్చికుక్క దాడితో పలువురికి గాయాలు

ప్రజాశక్తి-రావికమతం: మండల కేంద్రంలో గురువారం తెల్లవారు జామున పిచ్చికుక్క స్వైర విహారం చేసి పలువురిని గాయపరిచింది. ఇందులో మండల కేంద్రం బీసీ హాస్టల్ విద్యార్థినిలు 12 మంది కాగా, మేడివాడ గ్రామస్తులు ఐదుగురు, మండల కేంద్రానికి చెందిన గ్రామస్తులు ఆరుగురు వరకు ఈ పిచ్చి కుక్క దాడికి గురయ్యారు. దీంతో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు.బీసీ హాస్టల్ విద్యార్థినిలు టాయిలెట్లుకు వెళ్లగా దాడి చేసింది. దీంతో వీరిని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. మెరుగైన వైద్యం కొరకు నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. మిగిలిన వారందరూ వేరువేరు ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులకు తరలించారు.



గాయపడిన చిన్నారి

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి-నర్సీపట్నం: మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ గుడబండి ఆదిలక్ష్మిచ మున్సిపల్ వైస్ చైర్మన్ గొలుసు నరసింహమూర్తిలు గురువారం తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరితోపాటు వైసీపీ సీనియర్ నాయకుడు జీ.నాగేశ్వరరావు (జి.ఎన్. ఆర్) కూడా టిడిపిలో చేరారు.వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో కౌన్సిలర్లుగా గెలిచి, గత కొంతకాలంగా మాజీ ఎమ్మెల్యే గణేష్ కు దూరంగా ఉంటున్న ఇద్దరు కౌన్సిలర్లు గురువారం టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్ సమక్షంలో చేరారు.

పలు సమస్యలపై జగన్‌కు వినతులు

- ఉక్కు పరిరక్షణకు కృషి చేయాలని కార్మికుల విజ్ఞప్తి
- బల్క్‌డ్రగ్‌పార్కుపై మత్స్యకారుల మొర



ఉక్కు సమస్యలు వివరిస్తున్న అయోధ్యరామ్

ప్రజాశక్తి -గోపాలపట్నం : నర్సీపట్నం పర్యటనలో భాగంగా విశాఖపట్నంలో రోడ్డు మార్గంలో వెళ్తున్న మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని కాకానినగర్ వద్ద విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు కలుసుకొని స్టీల్‌ప్లాంట్, కార్మికులు సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. స్టీల్‌ప్లాంట్‌ను కాపాడతామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన కూటమి నేతలు ఇప్పుడు మోసం చేస్తున్నారని వివరించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై కేంద్ర క్యాబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని మార్చుకునేలా, ప్రత్యేకంగా గనులు కేటాయించేలా, సెయిల్‌లో విలీనం చేసేలా, సంస్థలో తొలగించిన ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోకునేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. స్టీల్‌ప్లాంట్‌ను ఎలాగైనా కాపాడాలని విజ్ఞప్తి చేశారు. ఈ విజ్ఞప్తి జగన్మోహన్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. తాము అధికారంలో ఉన్నా, విపక్షంలో ఉన్నా.. ఎప్పుడూ తమ వైఖరి ఒక్కటేనని, అది విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడుకోవడమే అని ఆయన స్పష్టం చేశారు. వైసిపి స్టీల్ ప్లాంట్ కార్మికులకు తోడుగా ఉంటుందని, ప్లాంట్ ప్రయివేటీకరణ కాకూడదన్నదే తమ లక్ష్యమని తేల్చి చెప్పారు. ఆ దిశగా కృషి చేస్తామని స్టీల్ ప్లాంట్ కార్మికులకు జగన్మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు జె.అయోధ్యరామ్ తదితరులు పాల్గొన్నారు.

నక్కపల్లి: నర్సీపట్నం మెడికల్ కాలేజ్ సందర్శనకు వచ్చిన మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దృష్టికి బల్క్ డ్రగ్ సమస్యను మత్స్యకారులు తీసుకువెళ్లారు. వైసీపీ రాష్ట్ర కార్యదర్శి (పార్లమెంట్) వీసం రామకృష్ణ ఆధ్వర్యంలో మత్స్యకారులు జగన్ మోహన్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. బల్క్ డ్రగ్ పార్క్ ను నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూ 26 రోజుల నుండి శాంతియుత దీక్షలు చేపట్టామని, బల్క్ డ్రగ్ ఏర్పాటు చేస్తే తమ ఉపాధికి, ఉనికికి ప్రమాదం వాటిల్లే పరిస్థితి నెలకొంటుందన్నారు. న్యాయం చేయాలని జగన్‌ను కోరారు. బల్క్ డ్రగ్ వద్దు, రాజయ్యపేట, బోయపాడు ముద్దు అనే ప్లకార్డును జగన్మోహన్ రెడ్డి ప్రదర్శించారు.

మునగపాక : అనకాపల్లి-అచ్యుతాపురం రోడ్డు విస్తరణలో భూములు కోల్పోతున్న వివిధ గ్రామాల నిర్వాసితులకు నగదు రూపంలోనే పరిహారం చెల్లించాలని మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వైసిపి ఎలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ రోడ్డు విస్తరణలో భూములు కోల్పోతున్న నిర్వాసితులకు కూటమి ప్రభుత్వం బలవంతంగా టిడిఆర్‌లు ఇచ్చి భూములు లాక్కోవాలని చూస్తుందని విమర్శించారు. 26 ఎకరాల భూమిని కోల్పోతున్న 1200 మంది నిర్వాసితులకు నగదు రూపంలోనే పరిహారం చెల్లించే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పలు గ్రామాల నిర్వాసితులు పాల్గొన్నారు.



మత్స్యకారుల సమస్యలు విన్నవిస్తున్న వీసం

డొంకాడలో భారీ వర్షం

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలో డొంకాడ గ్రామంలో గురువారం సాయంత్రం వర్షం కురిసింది. కొండల్లో భారీ వర్షం కురవడంతో కొండ గడ్డలు పొంగి ప్రవహించాయి. దీంతో గ్రామములో వర్షపు నీరు ముంచెత్తింది. పలువురి ఇళ్లల్లోకి వర్షపు నీరు వచ్చి చేరింది. దీంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



ప్రవహిస్తున్న వర్షపు నీరు

బాలికలకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి-వడ్డాది : నేటి బాలికలే దేశానికి పట్టుకొమ్మలని ఐసిడిఎస్ సిడిపిఓ మంగతాయారు తెలిపారు. జాతీయ బాలికా దినోత్సవ సందర్భంగా వడ్డాది కేజీబీవీ, హైస్కూల్, విజయరామరాజుపేట హైస్కూల్, పొట్టిదొరపాలెం స్కూల్‌లో లింగ వివక్షత, బాల్యవివాహాలపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. విజేతలకు జాతీయ బాలికా దినోత్సవం ఈనెల 11 న బహుమతి ప్రధానం చేస్తామన్నారు. ఈ కార్యక్రమం లో సూపర్వైజర్ నిర్మల దేవి, వైద్య సిబ్బంది, అంగన్వాడి కార్యకర్తలు, పాల్గొన్నారు.



వ్యాస రచన రాస్తున్న విద్యార్థులు

సిజెఐ గవాయ్‌పై దాడి హేయం

వామపక్ష పార్టీలు, దళిత, ప్రజా సంఘాల నిరసన



అనకాపల్లిలో నిరసన తెలుపుతున్న వామపక్ష పార్టీలు, దళిత ప్రజా సంఘాల నేతలు

ప్రజాశక్తి-అనకాపల్లి

భారత సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) బీఆర్ గవాయ్‌పై మతోన్మాద న్యాయవాది రాకేష్ కిషోర్ దాడిని ఖండిస్తూ గురువారం వామపక్ష పార్టీలు, దళిత, ప్రజా సంఘాల నాయకులు స్థానిక నెహ్రూచౌక్ జంక్షన్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, సిపిఐ నాయకులు వైఎన్.భద్రం, అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ అధ్యక్షులు దూలం బూసిరాజు, మాణిక్యాలరావు మాట్లాడుతూ దేశ అత్యున్నత న్యాయస్థానంలో ఉన్న చీఫ్ జస్టిస్ గవాయ్‌పై మతోన్మాదుల దాడి అత్యంత హేయమైనదని పేర్కొన్నారు. ఈ ఘటనకు పాల్పడ్డ ఉన్మాదిని దేశద్రోహిగా పరిగణించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇది రాజ్యాంగంపై దాడిగానే పరిగణిస్తున్నామన్నారు. దేశంలో బిజెపి ప్రభుత్వం రాజ్యాంగంపై దాడి చేస్తుందని, మతోన్మాద ప్రభావంతోనే రాకేష్ లాంటి వాళ్లు పెట్రేగిపోతున్నారని దుయ్యబట్టారు. దళితులు, గిరిజనులు మైనార్టీలపై ప్రత్యక్షంగా పరోక్షంగా దాడి చేయడంతో పాటు వారి హక్కులను కూడా హరిస్తోందని తెలిపారు. మతోన్మాదులకు రాజ్యాంగంపై నమ్మకం లేదని, అందుకే రాజ్యాంగాన్ని మారుస్తామని అనేకమార్లు ప్రకటిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వివి శ్రీనివాసరావు, ఆర్ శంకర్రావు, సిపిఎం మండల నాయకులు గంటా శ్రీరామ్, కాళ్ల తేలయ్య బాబు, కే సుభాషిణి, సిపిఐ నాయకులు కోరుబిల్లి శంకర్రావు, దళిత సంఘ నాయకులు కోనపల్లి సత్యారావు, రేబాక మధుబాబు, కోదండ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భెల్ కార్మికుల నిరసన

గాజువాక : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్.గవాయ్‌పై దాడిని ఖండిస్తూ భెల్ ప్రొగ్రెసివ్ ఫ్రంట్ ఆధ్వర్యంలో సంస్థ మెయిన్ గేటు వద్ద గురువారం నిరసన తెలిపారు. నల్ల బ్యాడ్జీలు ధరించి వర్షంలోనూ నిరసన కొనసాగించారు. ఈ సందర్భంగా ప్రొగ్రెసివ్ ఫ్రంట్ అధ్యక్షులు జిటిపి ప్రకాష్ మాట్లాడుతూ, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి అంటే రాజ్యాంగంపై దాడి చేయడమే అవుతుందన్నారు. ఇందుకు బాధ్యుడైన న్యాయవాదిని తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ దాడిని అన్ని కార్మిక సంఘాలు, రాజకీయ పార్టీలు ఖండించాలని కోరారు. ఈ కార్యక్రమంలో, సీతన్నాయుడు, కె.నారపరెడ్డి, మురళీశ్వరరావు, కె.విజయ్‌కుమార్, డి.నరసింహారావు, జి.అచ్చన్నాయుడు, జి.చిన్నబాబు, ఎస్.జగన్నాథరావు పాల్గొన్నారు



మాట్లాడుతున్న ప్రొగ్రెసివ్ ఫ్రంట్ అధ్యక్షులు జిటిపి.ప్రకాష్

జూడో టీమ్‌కు డిగ్రీ కళాశాల విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి-సబ్బవరం

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండవ సంవత్సరం కెమిస్ట్రీ విభాగానికి చెందిన విద్యార్థి శీరంశెట్టి మధుబాబు ఎయు అంతర్ కళాశాలల జూడో క్రీడా విభాగం జట్టుకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ బి శంకర్ తెలిపారు. తమ కళాశాల విద్యార్థి ఎంపిక కావడం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి శంకర్, ఇతర అధ్యాపకులు, హర్షం వ్యక్తం చేశారు.

లేజర్ స్క్రీన్, ఫుడ్ కోర్టును వినియోగంలోకి తేవాలి

ప్రజాశక్తి-అనకాపల్లి

ప్రముఖ బౌద్ధ పర్యాటక క్షేత్రం బొజ్జన్నకొండ వద్ద 15 కోట్ల రూపాయలతో నిర్మించిన లేజర్ స్క్రీన్, ఫుడ్ కోర్ట్ వినియోగంలోకి తేవాలని సిద్దార్థ సోషల్ సర్వీస్, కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షులు బల్లానాగభూషణం డిమాండ్ చేశారు. బొజ్జన్నకొండ వద్ద బౌద్ధ సంఘాల ప్రతినిధులు, బౌద్ధ ఉపాసకులు, సభ్యులతో కలిసి గురువారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు, ఉమ్మడి విశాఖ జిల్లా బౌద్ధ సంఘాల సమాఖ్య ప్రతినిధులు, బౌద్ధ ఉపాసకులు, బౌద్ధ అభిమానులు పాల్గొన్నారు.